www.prajadarbar.net

# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

PRAJADARBAR TELUGU DAILY

Editor : G. VENU GOPAL SHARMA

సంపుటి : 17 సంచిక : 99 కర్నూలు,తిరుపతి,కడప,అనంతపురం,హైదరాబాద్ ఆదివారం 19 -10 - 2025 Sunday,October,19,2025 పేజీలు : 8 వెల : రూ. 2/-

## స్వచ్ఛమైన గాలి..ఆరోగ్యక జీవనం

### కాలుష్యం కట్టడితో సాధ్యం – స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ పిలుపు

విజయవాడ : స్వచ్ఛమైన గాలితో మనం ఆరోగ్యకరంగా జీవన ప్రయాణం కొనసాగించ వచ్చని.. ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య కట్టడికి సమష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. క్టోబర్ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరువూరు మండలం, లక్ష్మీపురం గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం స్థానిక రైతులకు కిలో రూ. 10కే వర్మీ కంపోస్టును అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అంగన్వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, పీఎం సూర్యఘర్ స్టాళ్లను పరిశీలించారు.



## శ్రీవారి దర్శనం పేరుతో

# భక్తులకు టోకరా

### 4లక్షలు వసూలు చేసి దుండగుడి పరార్

### మోసగాడి కోసం పోలీసుల ఆరా

తిరుమల,అక్టోబర్18: తిరుమల శ్రీవారి దర్శనం పేరుతో ఓ దళారీ భక్తులను మోసగించి పరారయ్యాడు. శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానని తెలంగాణ భక్తుల నుంచి రూ.4 లక్షలు వసూలు చేశాడు. డబ్బులు ఆన్‌లైన్ ద్వారా వేసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఓ భక్తుడు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి దర్శనం కోసం పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆ శ్రీనివాసుడిని కనులారా వీక్షించి పునీతులవుతుంటారు భక్తులు. ఏడాదిలో ఒక్కసారన్నా తిరుమలకు రావాలని తపించిపోతుంటారు. అయితే తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల కొందరు మోసపూరితంగా వ్యవహరిస్తుంటారు.



## దేశం నుంచి మావోయిజాన్ని

# తరిమికొడతాం..

### ఇది నా గ్యారెంటీ

- దేశంలో మావోయిస్టు ఉగ్రవాదాన్ని త్వరలోనే అంతం చేస్తామన్నప్రధాని మోదీ
- ఇది తన వ్యక్తిగత గ్యారెంటీ అని స్పష్టం చేసిన ప్రధాన మంత్రి
- గత 72 గంటల్లో 303 మంది నక్సలైట్లు లొంగిపోయారని వివరణ
- గత ప్రభుత్వాల హయాంలో 'అర్బన్ నక్సల్స్' మావోయిస్టులను కాపాడారంటూ విమర్శ
- ఒకప్పుడు 125 జిల్లాల్లో ఉన్న మావోయిజం ఇప్పుడు 11 జిల్లాలకే పరిమితమైందని వెల్లడి
- బాధితుల వేదనను ప్రస్తావిస్తూ ప్రసంగంలో భావోద్వేగానికి గురైన మోదీ

ఢిల్లీ,: భారతదేశం త్వరలోనే మావోయిస్టు ఉగ్రవాదం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని, ఇది తన వ్యక్తిగత గ్యారెంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మావోయిస్టుల హింస ముగింపు దశకు చేరుకుందని ఆయన స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.దశాబ్దాలుగా అభివృద్ధిని అడ్డుకుంటూ, పేద గిరిజనులు, రైతులు, గ్రామస్థుల ప్రాణాలను బలిగొంటున్న మావోయిస్టు హింసపై ప్రధాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు బాధితులు ఢిల్లీ వచ్చి, తమ గోడును వినిపించుకోవడానికి ఏడు రోజులు పడిగాపులు కాశారని గుర్తుచేశారు. వారిలో కాళ్లు, చేతులు కోల్పోయిన వారు కూడా ఉన్నారని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 'అర్బన్ నక్సల్స్' రాజ్యాంగా న్ని అడ్డుపెట్టుకుని మావోయిస్టుల దారుణాలను కప్పిపుచ్చారని మోదీ ఆరోపిం చారు.ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిందని ప్రధాని తెలిపారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా 125 జిల్లాల్లో ఉన్న మావోయిస్టుల ప్రభావం, ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైందని వివరించా రు. వాటిలో కూడా అత్యంత తీవ్రంగా ప్రభావితమై నవి కేవలం 3 జిల్లాలు మాత్రమేనని స్పష్టం చేశారు. గడిచిన 72 గంటల్లోనే 303 మంది నక్సలైట్లు లొంగిపోయారని,వీరిలో రూ.1 కోటి వరకు రివార్డు ఉన్న కీలక నేతలు కూడా ఉన్నారని వెల్లడించారు.





# గతాన్ని మరచి మాట్లాడొద్దు

### పాక్ కు మరోమారు రాజ్‌నాథ్ హెచ్చరిక

లక్నో, : పాక్ గతాన్ని మరచి ప్రేలాపనలు పేలితో చావుదెబ్బ తప్పదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు హెచ్చరికలు చేశారు. ఆపరేషన్ సింధూరంను మరచిపోయి మాట్లాడొద్దని హెచ్చరించారు. పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే ఉందని గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనని మరోమారు దాయాది పాక్‌ని హెచ్చరించారు. బ్రహ్మోస్ క్షిపణులను సైన్యానికి అప్పగించిన నేపథ్యంలో శనివారం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. ఇక్కడ తొలివిడత బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేశారు. వాటిని కేంద్ర మంత్రి సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైన్యం పరాక్రమం, సంసిద్ధతను ప్రశంసించారు. భారత్ వద్ద ఉన్న అధునాతన క్షిపణి సామర్థ్యాల నుంచి శత్రుదేశం తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇక్కడి బ్రహ్మోస్ బృందం ఒక నెలలోనే రెండుదేశాలతో రూ.4వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకుంది. రానున్న రోజుల్లో ఇతర దేశాల నుంచి నిపుణులు లక్నోకు తరలివస్తారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యూనిట్ టర్నోవర్ రూ.3వేల కోట్లు అవుతుంది. ప్రతి ఏటా రూ.5వేలకోట్ల మేర జీఎస్టీ వసూలు అవుతుందని వెల్లడించారు.



# తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం

### అప్పుడే బిసిలకు రాజ్యాధికారం సాధ్యం

### బంద్‌లో పాల్గొన్న ఎంపి ఈటెల రాజేందర్

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రం ఎలా సాధ్యమైందో బీసీ రాజ్యాధికారం కూడా అలాగే సాధ్యం అవుతుందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్యంగా ఉద్యమాలు చేద్దామని బీసీ వర్గానికి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని జూబ్లీ బస్ స్టేషన్, సికింద్రాబాద్ లో బీసీల బంద్ లో ఈటెల పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపిందని చెప్పారు. ఇందులో భాగంగానే ఈరోజు ఉదయం సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ వద్ద 'తెలంగాణ బంద్ లో పాల్గొని మద్దతు తెలిపినట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారని.. అన్నీ తెలిసినా బీసీలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయితీగా రిజర్వేషన్లు అమలు చేసిందని చెప్పారు. పెరియార్ మొదలు అనేక గొప్ప ఉద్యమాలు జరిగాయని అన్నారు. 21 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో రెండేళ్లపాటు బీసీల ఆర్థిక, సామాజిక, విద్య అన్ని రంగాలపై సమగ్ర సర్వే చేసి.. ఆ రిపోర్ట్ తో రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ లో చేర్చారని గుర్తు చేశారు. తెలంగాణలోనూ కేసీఆర్ ఒకసారి సర్వే చేసి బీసీ కమిషన్ వేశారని.. ఎన్ని వేసిన నిజాయితీ లేదు కాబట్టి
అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం కూడా పేరుకు కమిషన్లు వేశారు తప్ప నిజాయితీ లేదని దుయ్యబట్టారు ఈటల. లెక్కలు తీశారు.. కానీ అవన్నీ తప్పుల తడక అని విమర్శించారు. 52 శాతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెప్తున్నారని మండిపడ్డారు. తాను చెప్పేది అబద్ధమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తాను మాట్లాడిన మాటలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. తామెంత మంది ఉన్నామో.. తమకు అంత కావాలని అన్నారు. యాచించే స్థాయిలో కాదు శాసించే స్థాయిలో బీసీలు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినా.. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బీసీ, ఒక ట్రైబల్ ముఖ్యమంత్రి కాలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో బీసీలు 8మంది మంత్రులుండాలని కానీ, ముగ్గురే ఉన్నారని ధ్వజమెత్తారు. ఉన్నా వారికి ఇచ్చిన మంత్రి శాఖలు చిన్నవే అని పేర్కొన్నారు. బీసీల పట్ల మొసలికన్నీరు కాకపోతే నామినేటెడ్ పోస్టుల్లో ఎందుకు బీసీలకు స్థానం కల్పించలేదు? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీని సీఎం చేస్తానని ప్రకటించిన ప్రధాని మోదీ క్యాబినెట్ లో 27మంది క్షఃఅ మంత్రులు ఉన్నారని గుర్తు చేశారు. బీజేపీ నిజాయితీని ఎవరు శంకించలేరని అన్నారు. మాదిగ రిజర్వేషన్ చేస్తామని మాట ఇచ్చి ప్రధాని అమలు చేశారని గుర్తు చేశారు. తమిళనాడులో ఏ పద్ధతి ప్రకారం చేశారో అదే పద్ధతిలో ఇక్కడ కూడా చెయ్యాలని రేవంత్ సర్కార్ ను డిమాండ్ చేశారు. ఈ బంద్ కి పిలుపు ఇచ్చింది బీసీ జేఏసీ అని.. అనివార్యంగా అన్ని పార్టీలు పాల్గొనాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదని చెప్పారు. బీసీ బంద్ విజయవంతం కావడం తొలిసారని చెప్పుకొచ్చారు. 42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థలలో మాత్రమే కాదు.. చట్టసభల్లోనూ వచ్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



# సేనతో సేనాని..

విజయవాడ,:రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేసేందుకు, సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేందుకు "సేనతో సేనాని – మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన పార్టీ ప్రకటించింది.



## ఉత్తరాంధ్రపై జగన్

# గురి

విశాఖపట్టణం, : ఉత్తరాంధ్ర పై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టారా? పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారా? వచ్చే ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారా? అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పుడే వ్యూహం రూపొందిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2029 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు తెచ్చుకుంటేనే వైసీపీకి ఛాన్స్ ఉంటుంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు ఎన్నికలను ఎదుర్కొంది. అందులో రెండింట దారుణ పరాజయం చవిచూసింది. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం.. ఉత్తరాంధ్రలో ఆరు సీట్లను గెలుచుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది..



## మిథున్ రెడ్డిని వెంటాడుతున్న

# సిట్

తిరుపతి, : ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ చేపడుతుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకవైపు విచారణ కొనసాగుతోంది. 29 మంది నిందితులకు గాను 12 మంది అరెస్టయ్యారు. అయితే లోతైన దర్యాప్తు చేస్తుండగా.. నిందితులు ఒక్కొక్కరికి బెయిల్ లభిస్తోంది. ఈ క్రమంలో బెయిల్ పై బయటకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కార్యాలయాలతో పాటు నివాసాల్లో సిట్ తనిఖీలు చేపడుతుండడం విశేషం. మరోవైపు ఎంపీ మిథున్ రెడ్డి బిజెపిలో చేరతారని ప్రచారం సాగింది. ఈ క్రమంలో ఆయన ఐక్యరాజ్యసమితికి వెళ్లే పార్లమెంటరీ బృందంలో ఒక సభ్యుడిగా ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది. బిజెపిలో చేరుతారన్న అనుమానాలను మరింత బలపరిచింది. అయితే ఈరోజు తిరుపతి తో పాటు హైదరాబాద్, బెంగళూరు నివాసాల్లోను సోదాలు జరుగుతున్నాయి.వైయస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. అప్పట్లో మద్యం లావాదేవీలు అన్ని మిథున్ రెడ్డి చూసేవారని టాక్ ఉంది. వైసీపీ హయాంలో ప్రతి శనివారం తాడేపల్లికి వచ్చి.. లిక్కర్ లెక్కలు చెప్పేవారని వైసీపీలోని ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని వైసిపి నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు కూడా. అయితే మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడుతో సమానంగా.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కమిషన్ల రూపంలో ఎక్కువగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోర్టులో బెయిల్ లభించింది.

# సంపాదకీయం

## సుంకాలపై మౌనమేల?

ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో– అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరు తెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. తాను అనుకుంటున్నట్టుగా ప్రపంచాన్ని నడిపించటానికి సుంకాల బెత్తం ఝుళిపించి, పెత్తనం చెలాయించాలని రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్నాడు. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ %% చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో– అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా %–% అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే– మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనం. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాలన్నది అమెరికా వ్యూహం. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. కానీ, నోరు మెదపటానికి సైతం మన ప్రధాని మోడీ వెనకాడుతుండటం విచారకరం. ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇది కనీస వ్యాపార సూత్రం. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించింది. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు. రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న దన్నేమిటి? ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే– అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలింపులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటి? వెన్నెముక ఉన్న ఏ ప్రభుత్వమైనా ఇలాంటి ధోరణులపై తక్షణం స్పందించాలి. అవసరం లేని అంశాలపై రాద్ధాంతాలు చేసిబీ ఆత్మగౌరవానికి, సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే విషయాలపై మాట్లాడకుండా మిన్నకుండడం సమంజసం కాదు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదం తలకెత్తుకున్న ట్రంప్.. ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకోవటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధాయుధ అమ్మకాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు. దరిమిలా విస్తారమైన అవకాశమున్న మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ మద గజాలను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోంది. అమెరికా అభీష్టానికి అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి– మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలూ, కష్టకారక లొంగుబాట్లూ వద్దంటూ ప్రజలూ గొంతెత్తాలి..!

# యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి




### – జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, యువత, విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని 221 పాఠశాలల్లో, 70 వసతి గృహాలు, ఇనిస్టిట్యూషన్లో మత్తుపదార్థాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 26వేల 700 మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. మిగిలిన పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. షీ టీమ్ లను కూడా అవగాహనలో భాగస్వామ్యం చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పోలీసు శాఖ తరపున గత 7 నెలల్లో 75 కార్యక్రమాలు నిర్వహించి 6550 మంది విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించామని తెలిపారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు.

11 ప్రదేశాల్లో అకస్మాత్తుగా తనిఖీలు చేశామని, 31.360 కేజీల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. 16 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చే శామని వెల్లడించారు. 390 డ్రగ్ డిడక్షన్ కిట్లను తెప్పించామని తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలుఉంటాయని హెచ్చరించారు. ఈసమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఆర్డీవోలు మహేశ్వ ర్రమేష్ బాబు,జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకరమణ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, విద్యాశాఖ కోఆర్డినేటర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ కుతంత్రం


### – ఏ.సంజీవ్ ముదిరాజ్ జనరల్ సెక్రటరీ,టీపీసీసీ

మహబూబాబాద్:తెలంగాణలో కొనసాగుతున్న యూరియా కొరత రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి సంకేతం కాదు. అసలు విషయం ఏమిటంటే ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుండటంతో, దానిని బదనాం చేయడానికి కావాలనే సృష్టిం చిన రాజకీయ కుట్ర. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే తెలంగాణ ప్రభుత్వం సుమారు ఏడు లక్షల టన్నుల యూరియా బఫర్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచి రైతుల అవసరాలను ముందుగానే తీర్చడానికి సన్నద్ధమైంది. కేంద్రం సరఫరా చేసే యూరియా రాష్ట్ర డిపాజిట్ సెంటర్లకు చేరి, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేసి, అక్కడి నుంచి పాక్స్, రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేట్ డీలర్లకు 60:40 నిష్పత్తిలో పంపిణీ చేసే పారదర్శక వ్యవస్థను అమలు చేసింది. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుగానే చర్యలు తీసుకున్నదని స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే తెలంగాణకు కేటాయించిన కోటాను సరిపడా విడుదల చేయకుండా, కేంద్రం కావాలనే కృత్రిమ కొరతను సృష్టిస్తోంది. ఈ వెనుక ఉన్న ఉద్దేశ్యం స్పష్టమే ు బీజేపీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం రైతులను లక్ష్యంగా చేసుకుని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీన పర్చాలని చూస్తోంది. ఎక్కువ కేటాయింపులు చేసినప్పటికీ, తక్కువ పరిమాణమే సరఫరా చేసి, సరఫరా గొలుసును అడ్డు కోవడం, రైతులలో అవసరంలేని భయాందోళనలు కలిగించడం జరిగింది. సహకార సమాఖ్య పద్ధతిని అనుసరించా ల్సిన చోట, కేంద్రంయూరియాను రాజకీయ ఆయుధంగా వాడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తెలంగాణ ఎంపీలు ఈ అంశంపై ఢిల్లీలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. అంతే కాకుండా ఏఐసీసీ సీనియర్ నాయకురాలు ప్రియాంకా గాంధీ కూడా తెలంగాణ రైతుల తరఫున గొంతు వినిపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయి లోనూ రైతుల తరపున పోరాటం చేస్తున్నదని నిరూపిస్తుంది. ఈ సంక్షోభం మధ్యలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ యొక్క రాజకీయ స్వార్థం రైతులకు మరింత అవమానాన్ని తెచ్చింది. సెప్టెంబర్ 9 లోపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తేనే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని బహిరంగంగా ప్రకటించడం రైతుల భవిష్యత్తును ఢిల్లీ రాజకీయాల్లో బేరసారాల సాధనంగా మార్చే నీచ రాజకీయమే. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి నిజాయితీగా కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం రైతుల ఇబ్బందులను తమ రాజకీయ బతుకుదెరువు కోసం వాడుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ యొక్క వైఖరి స్పష్టమైనది. తెలంగాణ రైతులు భయపడాల్సిన అవసరం లేదు. ఈ కొరత కృత్రిమంగా సృష్టించబడింది. వాస్తవానికి ప్రతిఎకరానికి రెండు సంచుల యూరియానే సరిపోతుంది. అంతకంటే ఎక్కువ వాడటం రైతులపై ఆర్థిక భారమే కాకుండా నేల ఆరోగ్యానికీ హానికరం. కాబట్టి సరఫరా కొనసాగించడమే కాకుండా, రైతులకు సరైన వినియోగం పై గ్రామస్థాయి కమిటీలు, పాక్స్, రైతు సేవా కేంద్రాల ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాము ఈ విధంగా అవగాహన పెంచడం ద్వారా, కేంద్రం సృష్టిస్తున్న కొరతనీ, భయాన్నీ కలిసి తిప్పికొడతాం. ఈ సంక్షోభం రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యలేమి కాదు, ఇది కేంద్రం చూపిస్తున్న అసహకత, టీఆర్ఎస్ ప్రదర్శిస్తున్న స్వార్థం. బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంధనం చేయడానికి కొరత సృష్టిస్తోంది, బీఆర్ఎస్ మాత్రం దానికి తోడు రాజకీయ లాభం కోసం రైతుల కష్టాలను వాడుకుంటోంది. కానీ తెలంగాణ రైతులు నిజాన్ని తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలిచింది, పోరాడింది, రక్షించింది. కేంద్రం కుట్రాబీఆర్ఎస్ ద్వంద్వ రాజకీయమా ఏదీ విజయవంతం కావు. తెలంగాణ రైతులకు న్యాయం జరగడం ఖాయం.

# మరో రంగాన్ని టార్గెట్ చేసిన ట్రంప్

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ వంటి రంగాల తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఫర్నిచర్ పరిశ్రమపై దృష్టి సారించారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న ఫర్నిచర్‌పై కొత్తగా భారీ సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం ఒక కీలక విచారణను ప్రారంభించబోతోందని శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "అమెరికాలోకి దిగుమతి అవుతున్న ఫర్నిచర్‌పై మేం ఒక పెద్ద టారిఫ్ విచారణ జరుపుతున్నాం. రాబోయే 50 రోజుల్లోగా ఈ విచారణ ప్రక్రియ పూర్తవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఫర్నిచర్‌పై ఎంత శాతం సుంకం విధించాలనేది ఇంకా నిర్ణయించలేదని, అయితే ఈ చర్య ద్వారా నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, మిచిగాన్ వంటి రాష్ట్రాల్లో ఫర్నిచర్ పరిశ్రమను తిరిగి నిలబెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, అమెరికాలో ఫర్నిచర్ తయారీ రంగంలో జులై నాటికి 3,40,000 మంది పనిచేస్తున్నారు. ఈ సంఖ్య 2000 సంవత్సరంతో పోలిస్తే దాదాపు సగం మాత్రమే. ప్రస్తుతం అమెరికాకు ఫర్నిచర్ సరఫరా చేస్తున్న దేశాల్లో చైనా, వియత్నాం అగ్రస్థానంలో ఉన్నాయి. 2024లో అమెరికా ఏకంగా 25.5 బిలియన్ డాలర్ల విలువైన ఫర్నిచర్‌ను దిగుమతి చేసుకున్నట్లు ట్రేడ్ నివేదికలు చెబుతున్నాయి. జనవరిలో ఉత్పత్తులపై కొత్త సుంకాలను విధిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఫార్మాస్యూటికల్స్, చిప్స్, కీలకమైన ఖనిజాలు వంటి అనేక ఉత్పత్తుల దిగుమతులపై జాతీయ భద్రత దృష్ట్యా విచారణలు కొనసాగుతున్నాయి. దేశాలవారీగా విధించే సుంకాలకు కొన్నిసార్లు చట్టపరమైన సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, ఇలా ఒక రంగంపై విచారణ జరిపి విధించే టారిఫ్‌లకు పటిష్ఠమైన చట్టపరమైన ఆధారం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త సుంకాలు అమల్లోకి వస్తే, దిగుమతిదారులపై భారం పెరిగి, అమెరికాలో ఫర్నిచర్ ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# అమెరికాలో బస్సు బోల్తా.. ఐదుగురు దుర్మరణం



న్యూయార్క్: అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నయాగరా జలపాతం అందాలను చూసి, న్యూయార్క్‌కు తిరిగి వె ళ్తున్న టూరిస్టు బస్సు పెంబ్రోక్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఐదుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపుతప్పి బోల్తా పడిపడిందని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో 1 నుంచి 74ఏండ్ల మధ్య వయస్కులు ఉన్నారని, వారందరిని ఎయిర్ అంబులెన్స్‌లో దవాఖానకు తరలించామని చెప్పారు.

మృతుల్లో చిన్నారులుఎవరూ లేదని తెలిపారు. ప్రమాద సమయంలో బస్సు లో54 మంది ఉన్నారని, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈఘటన జరిగిందని ఆంద్రే రే అనే పోలీసు అధికారి వెల్లడించారు. పర్యాటకు ల్లో అత్యధికులు భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనతో న్యూయార్క్ హైవేపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇదొక విషాద ఘటన అని న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ పేర్కొన్నారు. తమయంత్రాంగం సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధం చి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బెంగళూరులో ఆపిల్ భారీ ప్రాజెక్ట్..!

బెంగళూరు: ఆపిల్, ప్రపంచంలోని అతిపెద్ద టెక్ దిగ్గజాల్లో ఒకటి, భారతదేశంలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. తాజాగా భారత మార్కెట్‌ను మరింత సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. భారీగా పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమవుతోంది. బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయ స్థలాన్ని పదేళ్ల లీజు ఒప్పందంతో సొంతం చేసుకుం ది. ఈఒప్పందం విలువ విలేవే రూ.1,000 కోట్లకు పైగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యాలయం తొమ్మిది అంతస్తుల్లో విస్తరించి ఉండి, పార్కింగ్, ఇతర సౌకర్యాలను కలిగి ఉంది. నెలకు రూ.6 కోట్ల రెంట్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద కార్యాలయ లీజు ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది. ఈ లీజు ఒప్పందం ఆపిల్ భారత్‌పై దీర్ఘకాలిక నిబద్ధతను సూచిస్తుంది. 2.7 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం రూ. 1,000 కోట్ల విలువైన పదేళ్ల ఒప్పందం అనేది ఒక సాధారణ రియల్ ఎస్టేట్ ఒప్పందం కాదు. నెలవారీ రూ. 6 కోట్ల రెంట్, సంవత్సరానికి నిర్దిష్ట శాతం పెరుగుదలతో, ఈ ఒప్పందం ఆర్థిక దృష్ట్యా భారీగా ఉందని చెప్పవచ్చు. ఈ కొత్త కార్యాలయం ఆపిల్ యొక్క ఇంజనీరింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ), సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాలకు స్థలం కల్పిస్తుంది. బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పిలవబడే నగరం, దాని నైపుణ్యం కలిగిన టెక్ ప్రొఫెషనల్స్, ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటం వల్ల ఆపిల్ ఈ నగరాన్ని ఎంచుకుంది. ఈ కార్యాలయం ఆపిల్ ఉత్పత్తుల అభివృద్ధి, ముఖ్యంగా ఐఫోన్, ఇతర టెక్ సొల్యూషన్స్‌కు సంబంధించిన పరిశోధనలను మరింత వేగవంతం చేస్తుంది. ఇది స్థానిక ఉద్యోగులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, దీనివల్ల బెంగళూరు, భారతదేశంలోని టెక్ రంగం మరింత బలోపేతమవుతుంది. ఆపిల్ ఇప్పటికే భారతదేశం నుంచి ఐఫోన్ల ఎగుమతిలో అగ్రగామిగా ఉంది. ఈ కొత్త కార్యాలయం ద్వారా, ఆపిల్ తన ఉత్పాదన, ఎగుమతి సామర్థ్యాన్ని మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలోని తయారీ కేంద్రాల నుంచి ఐఫోన్‌లను ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేయడం ద్వారా, ఆపిల్ భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిస్తోంది. ఈ కార్యాలయం ద్వారా స్థానిక ఉత్పాదన, ఆవిష్కరణలు, ఎగుమతులు మరింత ఊపందుకుంటాయని పరిశ్రమ నిపుణులు మాత్రమే కాక, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక వరంగా ఉంటుంది.


# సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందరూ విధిగా చేసుకోవాలి

### డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు




జమ్మికుంట:జమ్మికుంట మున్సిపల్ పరిధి లోని ఎంప్లాయిస్ కాలనీ, కృష్ణ కాలనీ, కూడలి వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు (సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు) నిర్వహించడం జరిగింది. ఈ క్యాంప్ లో ఐసిటిసి విభాగం పాల్గొని హెచ్ఐవి,హెపటైటిస్ బి వంటి పరీక్షలు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది, అలాగే ఆరోగ్య శాఖ సిబ్బంది బిపి, షుగర్, టి.బి మలేరియా,డెంగ్యూ పరీక్షలు చేసి మందులు అందించడం జరిగింది ఈ శిబిరాన్ని హుజురాబాద్ డిప్యూటీ డిఎం హెచ్ ఓ,డాక్టర్ చందు, సందర్శించారు, ఈ సం దర్భంగా డాక్టర్ చందు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు హెచ్ఐవి, హెపటైటిస్ బి,టి బి, షుగర్ పరీక్షలు విధిగా ప్రతి ఒక్కరూ చేసుకోవాలని,సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీపీ, షుగర్ మందులు ప్రభుత్వం అందించే మందులనే వాడాలని తద్వారా ఆర్థికంగా భారం తగ్గించుకోవచ్చు అని మలేరియా, డెంగ్యూ,చికెన్ గునియా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి,వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత, డ్రైడే ప్రత్యేకత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన, డాక్టర్ ఫర్హానుద్దీన్, హెల్త్ హెడ్యుకేటర్, మోహన్ రెడ్డి, సూపర్వైజర్స్ రత్నకుమారి, దేవేందర్ రెడ్డి, ఐ సి టి సి కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్స్ రామకృష్ణ, ఇబ్రహీం, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధా, మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

# విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: జిల్లాకలెక్టర్ జితేష్ వి.పాటిల్ మణుగూరులోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల మరియు తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చే శారు. కలెక్టర్ తరగతి గదులు,భోజనశాల, వసతిగృహాలు,పాఠశా లపరిసరాల నుసమగ్రం గాపరిశీలించారు. హాస్టల్ తనిఖీ సమయం లో విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించి, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత,త్రాగునీరు, మంచం,దుప్పట్లు,స్నానాల గదులు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బం దులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించా లని కలెక్టర్ సూచించారు. తరగతి గదులను సందర్శిం చిన ఆయన, విద్యార్థుల చదువుపై ఆసక్తి, ఉపాధ్యాయుల బోధన, అభ్యాస స్థాయి పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ప్రభుత్వమందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠ్యబోధనతో పాటు పోటీ పరీక్షల శిక్షణను కూడా అందించాలని ఆయన గైడ్ చేశారు.

## అంగన్వాడి పిల్లలకు ఆటల పోటీలు



రామడుగు : రామడుగు మండలం గోపాలరావుపేట అంగన్వాడి పిల్లలకు నేషనల్ స్పోర్ట్స్ డే2025 సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ అంబటి వేణు కుమార్ ఆధ్వర్యంలో ఆటలపోటీలు నిర్వహించారు. అందులో భాగంగా పిల్లలకు రన్నింగ్ రైస్ స్టోన్ రైస్ ఫ్రాగ్ రైస్ మొదలగు క్రీడలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్రీడల వల్ల పిల్లలకు నైపుణ్యత స్నేహ భావన గౌరవభావన పెంపొందుతుందని మండల విద్యాధికారి అంబాటి వేణు కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులు రేణికుంట రియాన్స్ కొత్తూరు షైనీ చిన్నారి లాస్య ఎండి అంజల చీర్ల వినిమయి దేవాన్ష్ కళ్యాణ్ పురాణం చిన్ని మొదలగు వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో జలపతి సార్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీమతి వనిత కుమారి పిడి విఆర్ పాల్ రెడ్డి అంగన్వాడి టీచర్లు టీ విజయ టి పద్మజ ఎండి ఉసాయన డి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## షీ టీం నిఘా

కమాన్ పూర్: జన రద్దీ ప్రాంతాల్లో షీ టీం నిఘా ఉంటుందని స్నేహలత అన్నారు.రామగుండం సి.పిఆదేశాల మేరకు, రామగిరి, సెంటినరీ కాలనీ, కల్వచర్ల లోని ప్రగతిహై స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఎవరైనా చెడు గా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, మరియు వాటి నుంచి ఎలా బయటపడటం పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ఏకపక్ష నిర్ణయం

వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చేసే నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్మెంట్ యాక్ట్ (2006) రద్దుకు రాష్ట్ర మంత్రి మండలి ఏకపక్షంగా నిర్ణయించడం అభ్యంతరకరం. బుధవారం ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఓకే చేసింది కనుక ఈ ఊపులో తక్షణం నాలా చట్టం రద్దునకు ఆర్డినెన్స్ రావొచ్చు. లేదంటే త్వరలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నేరుగా బిల్లు ప్రవేశపెట్టనూవచ్చు. నాలా చట్టం రద్దుపై అధికారుల స్థాయిలో భేటీలు తప్ప విస్తృతంగా చర్చించి అభిప్రాయాలు సేకరించలేదు. దీన్నిబట్టే నాలా చట్టం రద్దు ప్రక్రియను రహస్యంగా ఉంచాలన్నది టిడిపి కూటమి ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. భూములతో, సేద్యంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులకు మాట మాత్రం చెప్పకపోవడం పారదర్శకతకు పాతరేయడమే. ఇంత హడావుడి, గోప్యత ఎందుకో సులభంగానే గ్రహించవచ్చు. నాలా చట్టం రద్దు కార్పొరేట్లకు భూపందేరం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో భాగమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సాగు భూములను రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, ఇతర వ్యవసాయేతర వ్యాపకాలకు విచ్చలవిడిగా మళ్లించకుండా నియంత్రించేందుకు ఉద్దేశించింది నాలా యాక్ట్. వ్యవసాయ భూములను సాగేతరాలకు మార్చుకోవాలంటే భూమి యజమానులు నాలా చట్టాన్ననుసరించి దరఖాస్తులు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి కొంత పన్నులు వసూలు చేసి అనుమతులు మంజూరు చేస్తారు. కార్పొరేట్లకు భూములిచ్చేందుకు ప్రభుత్వానికి నాలా చట్టం అడ్డంకిగా తయారైందని సర్కార్ భావించినట్లుంది. నాలా పన్ను రూపంలో ఏడాదికి ప్రభుత్వానికి సుమారు రూ.300–350 కోట్ల ఆదాయం లభిస్తోంది. ఈ నిధులను స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. నాలా రూపంలో లభిస్తున్న ఆదాయాన్ని పోగొట్టుకోకుండా, స్థానిక సంస్థలకు అన్యాయం జరగకుండా చూస్తామని, అందుకు అవసరమైన చట్టాలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇంత రిస్క్ ఉన్నా నాలా చట్టం రద్దుకే ప్రభుత్వం సై అనడానికి 'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యమే హేతువు. ఇప్పటికే ఎకరా 99 పైసలకు 99 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కారుచౌకగా వేలాది ఎకరాలను కార్పొరేట్లకు ప్రభుత్వం ధారాదత్తం చేస్తోంది.



అదానీ, ఇతరులకు వందల వేల ఎకరాలను ఉదారంగా రాసిచ్చేస్తోంది. అది చాలదన్నట్లు వాళ్లు ఎక్కడ కోరుకుంటే అక్కడ భూములిస్తామని బంపర్ ఆఫర్లు ఇస్తోంది. ఈ పూర్వరంగంలోనే నాలా చట్టం రద్దును చూడాలి. విభజన అనంతర ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రంగా ఉంది. అత్యధిక ప్రజలకు సేద్యపు రంగమే జీవనాధారం. ఇక్కడే సాగు భూమి తగ్గుతోందని సామాజిక, ఆర్థిక సర్వే సహా పలు సర్కారీ నివేదికలు ఘోషిస్తున్నాయి. పంటలు సాగవుతున్న నికర భూమి 2008–09లో 168 లక్షల ఎకరాలు కాగా 2023–24లో 123 లక్షల ఎకరాలు. దశాబ్దంన్నరలో 45 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ఇదే సమయంలో ఆహార ధాన్యాల సాగు పది లక్షల ఎకరాల్లో తగ్గింది. ఆరున్నర లక్షల ఎకరాల వ్యవసాయ భూమి వ్యవసాయేతర అవసరాలకు మారిపోయింది. ఈ ధోరణి భూమి వినియోగానికి ప్రమాద ఘంటిక. వ్యవసాయ భూముల పరిరక్షణ ఆవశ్యకతను నొక్కిచెబుతోంది. నాలాచట్టం ఉన్నప్పుడే తక్కువ సమయంలోనే పెద్ద ఎత్తువ్యవసాయ భూములు వ్యవసాయేతరాలకు మారిపోయా యి. ఎలాంటి అనుమతులూ లేకుండా పట్టణాలు, నగరాలు, సెమి అర్బన్ శివార్లలో ని వ్యవసాయ భూముల్లో వెంచర్లు పడుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకు మునిగిపోతుం డటం చూస్తున్నాం. కొద్దిమేరకైనా వ్యవసాయ భూములను నాలా చట్టం కాపాడగా,అది రద్దయితే పరిస్థితి ఇంకెంత భయంకరంగా తయారవుతుందో ఊహించవచ్చు. నాలా చట్టం రద్దుకు ముందే రైతులు, వ్యవసాయ కార్మికులతో ప్రభుత్వం చర్చించాలి. వ్యవసాయ భూముల పరిరక్షణకు సమగ్ర చట్టం చేయాలి. భూమి వినియోగంపై పాలసీ తీసుకు రావాలి. ఆపని చేయకుండా నాలా చట్టాన్ని రద్దు చేస్తే రైతులకు, కూలీలకు, సేద్యానికి, ప్రజల ఆహారానికి భవిష్యత్లో జరిగే నష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

## ఊరంతా చెత్త.. చెత్త

మెదక్:అసలే వర్షాకాలం... ఆపై దోమలు ఈగలు ఎక్కువ.. నిరంతరం పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం తమ సొంత మంటూ అధికారులు నిత్యం చెబుతున్న మాట.. ఈ మాటను నిజం చేసేలా ప్రజలు జీవన మనుగడ తో ముందుకు సాగాలని చెబుతున్నప్పటికీ మల్లాపూర్ గ్రామంలో మాత్రం అపరిశుభ్రతకు కేరాఫ్ గా నిలుస్తుంది. ట్రా క్టర్ బాగు చేసేందుకు నిధులు లేక బాగు చే యలేకగ్రామంలో గత 15 రోజుల నుంచి చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. స్పందించాల్సిన అధికార యంత్రం నెలకొన్న సమస్యను పరిష్కరించడంలో విఫలమైంది. నిధు లు లేవు.. డబ్బులు ఎన్ని బయట నుంచి తీ సుకువచ్చి బాగు చేస్తామంటూ పంచాయతీ కార్యదర్శి సైతం ఆవేదన వ్యక్తం చేసే రోజులు వచ్చేశాయి. ప్రజాపాలన అంటూ ప్రభుత్వం గంభీరమైన మాటలు చెబుతున్నప్పటికీ వాస్తవ రూపంలో గ్రామాల్లో తీవ్ర ఇబ్బందుల్లో నెట్టుకొస్తున్నాయని చెప్పడంలో కోయిలకొండ మండలం మల్లాపూర్ గ్రామంమే ఉదాహరణ. గత15 రోజుల నుంచి వర్షాలు కూడా అధికంగా ఉన్నాయి... ఆపైగా గ్రామంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. గత ప్ర భుత్వము ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ చేయాలని ట్రాక్టర్ తో పాటు గ్రామ పారిశుధ్య కార్మికులను సైతం ఏర్పాటు చేసింది.ఈ ఫ్యాక్టరీ నిరంతరం జరగాలని ప్రతిరోజు ట్రా క్టర్ ద్వారా చెత్త సేకరణ జరగాలని ఆ విధా నం కొనసాగుతున్నప్పటికీ గ్రామపంచాయతీలకు నిధులు లేకపోవడంతో ట్రాక్టర్లకు జ్వ రం వస్తే చూపించే వారే దిక్కు లేకుండా పో యింది.అధికారులు సైతం చేతులెత్తేసి తా ము ఏం చేయలేమని చెప్పడం మరొక ప్రత్యేక విశేషం. ఉన్నత అధికారులు స్పందించి ప్రత్యేకంగా నిధులు సరఫరా చేయడంతో పాటు సమస్యను పరిష్కరించాలని మల్లాపూర్ గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు.. చుట్టూ ముట్టు తున్న సీజన్ వ్యాధులు..: అసలే వర్షాకాలం కావడంతో కంప చెట్ల తో పాటు ఎక్కడపడితే అక్కడ మురుగునీరు కూడా ఎక్కువగా నిలిచే అవకాశాలు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు డ్రైనేజీలతోపాటు చిత్త సేకరణ సేకరిస్తూ పరిశుభ్రతకు అడుగులు వేయించవలసిన అధికారులు తాము ఏమిచేయలేమంటూ చేతులు ఎత్తిస్తే ప్రజలు ఏమైపోయినా పర్వాలేదా అనే సాంకేతాన్ని సూచిస్తుంది.డెంగీ, మలేరియా, టైఫాయిడ్, తో పాటు వివిధ రోగాల బారిన ప్రజలు పడుతున్నప్పటికీ అధికారులు చెత్త సేకరణకు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికార యంత్రం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ట్రాక్టర్ బాగు చేసేందుకు నిధులు లే వు. ఎన్ని డబ్బులు అన్ని బయటనుంచి తీసుకురావాలి. తీసుకువచ్చినప్పటికీ డ బ్బులు రావడం లేదు. గ్రామంలో ఎవరైనా ముందుకు వస్తే బాగు చేస్తామని చెప్పినప్పటికీ ఎవరు ముందుకు రావ డం లేదు. దీంతో గత 12 రోజులుగా చెత్త సేకరణ చేయడం లేదు. ఎంపీటీవో కి కూడా సమాచారం అందించాను.

## ప్రైవేట్‌కు 'ఎత్తిపోత'!..?

**సాగునీటి పథకాల అప్పగింతకు సర్కారు కసరత్తు**

**రాష్ట్ర వ్యాప్తంగా 999 ప్రాజెక్టులు గుర్తింపు**

**హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అమలు**



శ్రీకాకుళం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రైవేట్ జపం చేస్తోన్న టిడిపి కూటమి ప్రభుత్వం తాజాగా ఎత్తిపోతల పథకాలనూ ప్రైవేట్‌పరం చేసేందుకు సిద్ధమవుతోంది. పథకాల నిర్వహణను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హమ్)లో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులకు ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసింది. జిల్లాలో మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలు, కొత్తగా నిర్మించాల్సిన పథకాలపై నివేదిక రూపొందించాలని ఆదేశించింది. రిపేర్లకు, కొత్త పథకాల నిర్మాణాలకు ఎంతేసి మొత్తంలో నిధులు అవసరమవుతాయో నివేదికలు తయారు చేయాలని సూచించింది. దీంతో, ఆ మేరకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఎత్తిపోతల పథకాలను హమ్ మోడల్‌లో అప్పగించేందుకు ఈ నెల మొదటి వారంలో అమరావతిలో జిల్లాల అధికారులతో వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాపులో ఆ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 999 ఎత్తిపోతల పథకా లను గుర్తించారు. ఇవి 8.13 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నా యి. ఎత్తిపోతల పథకాలకు ఎంతమేర నిధులు కావాలో నివేదికల ను పంపాలని ప్రభుత్వం సూచించడంతో అధికారులు వీటి తయారీలో నిమగమయ్యారు. పథకాల నిర్వహణకు అవసరమైన నిధుల లెక్క తేలిన తర్వాత ప్రభుత్వం వీటికి టెండర్లను పిలవనుం దని సమాచారం. టెండర్లలో ఎంపికైన ప్రైవేట్ వ్యక్తులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసంహమ్ మోడల్‌లో పదేళ్లపాటు అప్పగిం చనున్నారు.వారికి లబ్ధి కూర్చే విధంగా దీని రూపకల్పన ఉంది. ముందుగానే 40 శాతం నిధులు ప్రైవేట్ వ్యక్తులకు చెల్లింపు!: పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)లో కొన్ని అంశాలను సవరించి హమ్ విధానాన్ని రూపొందించినట్లు సమాచారం. పిపిపి బిల్డ్ ఆపరేట్ సిస్టమ్(బిఒటి) కంటే హమ్ మోడల్ ప్రైవేట్ వ్యక్తులకు రిస్క్ లేకపోవడంతోఈ విధానాన్ని ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం అమలు చేయనుంది. హమ్‌మోడల్‌లో 40శాతంనిధుల ను ప్రభుత్వం ముందు గానే ప్రైవేట్ వ్యక్తులకు చెల్లించనుంది. పథకాల నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అదనంగా సాయం అందించనుంది. ఎత్తిపోతల పథకాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించ డంతో అంతిమంగా దాని భారం రైతులపై పడనుందన్న చర్చనడుస్తో ంది. పంపుహౌస్‌ల నిర్మాణం, మోటర్లు, విద్యుత్తు బిల్లులకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు అవకాశం ఉండడంతో రైతుల నుంచి ఆ మేరకు డబ్బులు వసూలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని పొందుతున్న రైతుల నుంచి ఎకరాకు రూ.200 చొప్పున నీటితీరువా కింద ప్రభుత్వం వసూలు చేస్తోంది. ఎత్తిపోతల పథకాలకూ ఎకరాకు ఎంత వసూలుచేస్తే బాగుంటుందన్నఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

## ఖజానాకు భారంగా తాయిలాలు

విజయవాడ, : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాల పేరుమీద జరుగుతున్న తాయిలాల పంపకం ఖజానాకు పెనుభారంగా మారుతోంది. గతంలో వైసిపి, ప్రస్తుత కూటమి పోటీపడి మరీ అప్పుల మీద అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిజానికి అవసరంలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ దానకర్ణులు అనిపించుకోవడం కోసం సరైన రాబడి రాకుండానే ఇలా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం అప్పుల మీద అప్పులు చేస్తూ వెల్ఫేర్ స్కీమ్ అమలు చేస్తున్న తీరు మేధావి వర్గాల్లో ఏపీ భవిష్యత్తుపై ఆందోళన పెంచుతోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 లో దిగిపోయేసరికి కేవలం సంక్షేమ పథకాలు కోసం ప్రతి ఏటా 70 వేల కోట్ల వరకూ ఖర్చుపెట్టినట్టు ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. దీనికోసం వివిధ కార్పొరేషన్లలోని డబ్బులు సైతం వాడేసారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి మరీ అప్పులు తెచ్చారని టిడిపి, జనసేన తీవ్రంగా ఆరోపించేవి. ఏపీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది అనేది వారి ప్రధాన విమర్శ గా ఉండేది. అమ్మ ఒడి, నాడు –నేడు లాంటి పథకాల వల్ల చాలామందికి మేలు జరిగిన మాట వాస్తవమే అయినా మిగిలిన అనేక పథకాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది అనేది చాలామంది ఎనలిస్ట్ లు, ఆర్థిక వేత్తల అభిప్రాయం. అటు అమరావతి పక్కకు పోయి, మూడు రాజధానుల వ్యవహారం బెడిసి కొట్టి, పోలవరం ప్రాజెక్టు అతిగతీ లేని పరిస్థితుల్లో పడిపోవడంతో చివరికి సంక్షేమ పథకాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని కాపాడలేకపోయాయి. అప్పట్లో రాష్ట్రం లోని రోడ్ల పరిస్థితులపై సామాన్యులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు తీవ్ర అసంతృప్తి వెళ్ళబుచ్చేవారు. విచిత్రంగా వీరిలో చాలామంది సంక్షేమ పథకాల లబ్ధి దారులే కావడం విశేషం. అంటే ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి, కనీస సౌకర్యాలు ముఖ్యమనేది చాలా స్పష్టంగా పాలకులకు తెలియజేసిన ఎన్నికల ఫలితాలు అవితెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రో డెవలప్మెంట్ లీడర్గా చంద్రబాబు కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్థిక పరమైన సంస్కరణలకు ఏమాత్రం వెనుకాడే వ్యక్తి కాదని చంద్రబాబు నాయుడు పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టడానికి ముఖ్యమైన కారణం ఇదే. 2024 ఎన్నికల్లోనూ ప్రజలు చంద్రబాబుపై రాష్ట్ర అభివృద్ధి అనే యాంగిల్ లోనే ప్రధానంగా ఓట్లు వేశారు. కేవలం సంక్షేమ పథకాలు కోసమే అయితే ఆ ఓటు జగన్ కే వేసి ఉండేవారన్న అభిప్రాయం చాలా మంది రాజకీయ నేతల నుండి వెలువడుతోంది. కానీ చంద్రబాబు మాత్రం సంక్షేమ పథకాలలో కూడా తన ముద్ర చూపే దిశగా ఒకదాని వెంట ఒకటి పథకాలు అమలుచేసుకుంటూ వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే డెస్ప రేషన్ తో ఇచ్చిన హామీలపై అప్పట్లోనే మేధావివర్గాల నుంచి విమర్శలు వెలువడ్డాయి. ముఖ్యంగా 20లక్షల మంది యువకులకు నెల నెలా 3000 చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు 1500 చొప్పున ఇస్తామన్న హామీ లపై అవెలా సాధ్యమన్న విమర్శలు బలంగా వచ్చాయి. దానికి తగ్గట్టే ఇటీవల రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు కూడా " మహిళలకు 1500 చొప్పున ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ " ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి చెప్పకనే చెప్పారు. ఎన్నడూ లేనట్టు మూడు లక్షల ఇరవై రెండు వేల కోట్లతో ప్రవేశ పెట్టిన 2025–26 ఏపీ బడ్జెట్లో కూడా వీటి పై స్పష్టత ఇవ్వలేదు. అయినప్పటికీ బడ్జెట్లో అధిక భాగం సంక్షేమ పథకాలకు కేటాయించారు. ఏపీ జీవనాడి అయిన పోలవరానికి బడ్జెట్ లో కేటాయించింది 6300 కోట్లు మాత్రమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నామని చెబుతూనే ఆర్థిక మంత్రి రెవిన్యూ లోటు 33 వేల కోట్లు, ద్రవ్య లోటు దాదాపు 80000 కోట్లుగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాల మాట ఎలా ఉన్నా ఏపీ ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకుంటున్నవి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం, రాజధాని కి ఒక రూపం రావడం. వీటితోపాటు గుంతలు లేని రోడ్లు,లోపాలు లేని విద్య వైద్య సౌకర్యాలు. ప్రస్తుతం ఒకరిపై ఒకరు పోటీపడి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు ప్రభుత్వం నుంచి కోరుకుంటున్న అంశాలకు అడ్డుకట్టుగా మారిపోయే ప్రమాదం లేకపోలేదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఈ సంక్షేమ పథకాల హామీ లను మరింతగా పెంచే పనిలో కచ్చితంగా రాష్ట్రం లోని పార్టీలు పడతాయి. నిజం చెప్పాలంటే జగన్,చంద్రబాబు ఒక విధమైన పులి స్వారీ చేస్తున్నారనే చెప్పాలి. సవారీ చెయ్యలేరు.. అలాగని కిందకు దిగనూ లేరు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా ఉచిత హామీలతో పరుగులు పెట్టడంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా చర్చించి ఒక కీలక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసిందని అభిప్రాయపడ్డారు సీనియర్ రాజకీయవేత్త, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్. ఆయన ప్రస్తుతం జాతీయ పార్టీ బిజెపిలో సభ్యుడిగా ఉన్నారు. ఇలా అన్ని పార్టీలు ఉచితాలకు సంబంధించిన హామీలపై ఒక బ్రేకుల్లేని విధానంతో ముందుకు సాగడం భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థకు చేటు చేయడంతో పాటు పేదలను మరింత పేదలుగా మార్చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు.

## రోడ్డు పనులు ప్రారంభించిన మాజీ సర్పంచ్ సమ్మయ్య

కమాన్ పూర్: పాలకుర్తి మండలం జీడి నగర్ మాజీ సర్పంచ్ సుర సమ్మయ్య రోడ్డు పనులను ప్రారంభించారు. జీడి నగర్ గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుండి 5 లక్షల రూపాయలు తో తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుర్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పనులను పూర్వ ప్రగతి పనుల జాతర లోభాగంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు పొడుసు కొమరమ్మ ఎల్ల స్వామి పల్లెపు కనకయ్య పల్లెపు ఎల్లయ్య ముదంగుల కనకయ్య రాజు మహేందర్ సంపంగి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# వీధి జంతువులతో జాగ్రత్త!



పెంపుడు జంతువుల పట్ల ప్రేమ ఉండటం సహజమే. కానీ వాటి ద్వారా వచ్చే కొన్ని దుష్పరిణామాలు కూడా తెలుసుకోవటం మంచిది. పశువులు, శునకాలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, కోళ్లు, పక్షుల నుంచి మనుషులకు కొన్ని వ్యాధులు సంక్రమిస్తాయి. పెంపుడు జంతువులను ఎవరి ఇంట్లో వాళ్లు పెంచుకుంటే మిగతా వారికి ఇబ్బందులు ఉండవు. కానీ, కొందరు విచక్షణా రహితంగా వీధుల్లో వదిలేస్తుండటమే ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

వీధి కుక్కలతో ఇబ్బందులు: ఇళ్లల్లో వదిలేసిన కుక్కలే వీధుల్లో తిరుగుతూ ఆ తర్వాత వాటి సంతతిని వృద్ధి చేసుకుంటు న్నాయి. ఇవి వీధుల్లో తిరుగుతూ ప్రజాజీవనానికితీవ్రఆటంకాన్ని కల్గిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఇదే సమస్య. పౌర జీవనానికి ఇబ్బంది కల్గిస్తోంది. మిగతా ప్రాంతాల సంగతి అటుంచితే మన రెండు రాష్ట్రాల్లోనూ వీధి కుక్కల బెడద ఎక్కువైపోతోంది. మనదేశంలో 11 సెకన్లకో కుక్కకాటు కేసు నమోదవుతోంది. పసికందులు, వృద్ధులపైనా వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. 2024లో ఒక్క ఏడాదిలోనే దేశంలో 37 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విశాఖపట్టణం, తిరుపతి ఇలా అన్ని ప్రాంతాల్లో ఊర కుక్కలు గుంపులు గుంపులుగానే సంచరిస్తున్నాయి. పసిపిల్లలను ఎత్తుకెళ్లటం దగ్గర నుంచి పెద్దల రక్త మాంసాలను లాగేసే వరకూ వీటి ఉధృతి పెరిగింది.

విదేశాల్లో పద్ధతులు ఆచరణీయం: మనదేశంతో పోలిస్తే చాలా దేశాల్లో వీధి కుక్కలు పెద్దగా కనిపించవు. ఉన్నా వాటికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తారు. జనన నియంత్రణ ఇంజక్షన్లు సైతం చేసేస్తారు. వాటికి సంబంధించిన వివరాలు కుక్క మెడలో పొందుపర్చి ట్యాగ్‌లుగా ఉంటాయి. కుక్కల సంతతి నియంత్రణ చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనదేశంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. వీధి కుక్కలతో ర్యాబిస్ ప్రబలితే అది పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదకర మవుతుంది. దీన్ని నివారించడానికి ప్రపంచవ్యాప్తంగా పలు పద్ధతులను పాటిస్తున్నారు. శునక జనన నివారణ శస్త్ర చికిత్సలు (ఎబిసి), ర్యాబిస్ టీకా కార్యక్రమాలు, సిఎన్‌విఆర్ పద్ధతిని కొన్నిచోట్ల అనుసరిస్తున్నారు.

కారుణ్య పద్ధతి విధానాన్ని ఒక్క రోజులోనే పూర్తి చేయొచ్చు. శ్రీలంక, థారులాండ్, ఇండోనేషియా, మాల్దీవులు వంటి దేశాల్లో దీన్ని విజయవంతంగా అనుసరిస్తున్నారు. వీధి కుక్కల సమస్య నివారణకు ఇది చక్కటి ప్రత్యామ్నాయమని తమిళనాడు వెటర్నరీ, జంతుశాస్త్రాల విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొన్న విషయం తెలిసిందే.

హడావుడి తప్ప ఆచరణ శూన్యం: దేశంలో ఏ ప్రాంతంలోనైనా రాత్రి 10 గంటల తర్వాత తమ ఇళ్లకు ప్రజానీకం వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సిందే. గుంపులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిని భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. రోడ్లపైనే ఉంటూ అక్కడ మలమూత్ర వ్యర్థాలు వదులుతూ కంపు కొట్టేలా చేస్తున్నాయి. అవి తెల్లవార్లూ అరుస్తూ ఉంటే నివాసితులు కంటిపై కునుకు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు రక్షణ చర్యలు ముఖ్యం: సమస్య తీవ్రతను గుర్తించి తెలంగాణా, ఆంధ్ర ప్రభుత్వాలు శునక జనన నివారణ శస్త్రచికిత్సలు, ర్యాబిస్ టీకా కార్యక్రమాల (ఎఆర్‌వి)కు ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేయటం ఎంతో మేలు. వీధి కుక్కల వీరంగాలపై ఫిర్యాదు చేయడానికి వీలుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వీధి కుక్కలకు నూరు శాతం యాంటీ ర్యాబిస్ టీకాలు వేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించటం ఎంతో మంచి ఆలోచన. ఇలాంటి చర్యలు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని చోట్లా చిత్తశుద్ధితో అమలుచేస్తేనే వీధి కుక్కల భారి నుంచి ప్రజలకు రక్షణ లభిస్తుంది.

ఆలనలేని ఆవులు, ఎద్దులతో ప్రమాదాలు: రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులతో కూడా చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు యజమానులు వాటికి దాణా వేయకుండా వీధుల్లోకి వదిలేస్తుండటంతో అవి స్వైర విహారం చేస్తూ పిల్లలు, పెద్దలు, మహిళలను పొడిచి, గాయపరుస్తున్నాయి. ప్రధాన రోడ్లపై పడుకుంటూ ప్రజల రాకపోకలకు అంతరాయాన్ని కల్గిస్తున్నాయి.

ఇటీవల ఆవు దాడిలో విజయవాడ కృష్ణలంకకు చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ నరసింహారావు మృతి చెందారు. పశువుల దాడిలో చాలామంది గాయపడిన ఉదంతాలు ఉన్నాయి. కొన్ని నగరాలు పట్టణాల్లో అధికారుల స్పందిస్తున్నా వాటి బందులదొడ్డిలో ఒకటీ, రెండ్రోజులు ఉంచి జరిమానా వేసి పంపించేస్తున్నారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోవటం లేదు.

# కోస్తా జిల్లాల్లో యాచకం... నిషేధం..



కాకినాడ: ఏపీ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చూడాలని చూస్తోంది. ఇప్పటికే విశాఖలో పోలీస్ శాఖ ఆ పని చేస్తోంది. అయితే ఇప్పుడు ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చేయాలని.. వృత్తిని నిరోధించే ఏపీ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందనుంది. గవర్నర్ ఆమోదంతో చట్టాన్ని అమలులోకి తెస్తారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలో ప్రధాన నగరాలుగా ఉన్న విశాఖ విజయవాడ, తిరుపతి, కర్నూలు, అమరావతి, గుంటూరు, రాజమండ్రి, విజయనగరంలో యాచక వృత్తిని నిషేధిస్తారు. యాచకులు లేని నగరాలుగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పేదరిక నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం పి4 ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పేదరికాన్ని సూచికగా ఉండే యాచకులు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాచకులు ఉన్నరాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్‌తొలి స్థానంలో ఉంది. తమిళనాడు రెండు, ఢిల్లీ మూడో స్థానంలో ఉంది. నాలుగో స్థానంలో ఏపీ కొనసాగుతో ంది.అయితే ఏపీలో యాచకుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని చూస్తోంది. దానికి యాచకులు అవరోధంగా భావిస్తోంది. అందుకే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి, విద్యా వైద్యం వంటి సౌకర్యాలు కల్పించి.. సాధారణ పౌరులుగా జీవించేలా చేయనుంది. వారికోసం ప్రత్యేక షెల్టర్లను సైతం అందుబా టులోకి తేనుంది.విశాఖలో పోలీస్ శాఖ ద్వారాయాచకు లను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలామంది గ్రామాల నుంచి వచ్చి యాచక వృత్తిని ఆశ్రయిస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలు అం దించి వారిని సాధారణ పౌరులుగా మార్చుతున్నారు. విశాఖలో వీధిలోకనిపించే యాచకులను గుర్తిస్తున్నారు. నిరాశ్రయుల కు భోజన వసతి కల్పిస్తున్నారు. వారికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా తరువాత నగరాల్లో యాచకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ప్రముఖ దేవస్థానాలు ఉన్నచోట వీరు పెరుగుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం యాచక వృత్తిని నిషేధించాలని భావించింది. ప్రధాన నగరాలతో పాటుప్రముఖ పుణ్యక్షేత్రాలను సైతం ఆ జాబితాలో చేర్చింది. తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, రామతీర్థాలు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సైతం ఇకనుంచి యాచకులు కనిపించకుండా పగడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

# ఏపీలో జాలీ ట్రావెలింగ్!


తిరుపతి, : ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడు మినీ ఎయిర్పోర్టులను తీసుకురా వాలని నిర్ణయించింది. హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి హెలికాప్టర్ సేవలు అందించడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, అరకు ప్రాంతాల మధ్య ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో హెలికాప్టర్ పర్యాటకం నిరం తరం అందుబాటులో ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్రాం తాలను ఆకాశమార్గంలో చూసే అరుదైన అవకాశం కల్పించను న్నారు.రాష్ట్రంలో హెలిక్యాప్టర్ టూరిజం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం మూడు ప్రాంతాల నుంచి హెలికాప్టర్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసక్తి కలిగిన ప్రైవేట్ ఏజెన్సీ ల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఎక్కడ హెలిప్యాడ్లను ఏర్పాటు చెయ్యాలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు జాలి రైట్ కొన్ని సందర్భాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఇకనుంచి అలా కాకుండా నిరంతరాయంగా సేవలందిలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో ప్రైవేట్ వీటిని నిర్వహించాయి. అక్కడ సక్సెస్ ఫుల్ గా కనిపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తోంది.ప్రధానంగా పర్యాటక ప్రాంతాలను కలుపుతూ హెలిక్యాప్టర్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం చూస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖ మధ్య హెలికాప్టర్ సేవలను నడపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిరోజు విజయవాడ, హైదరాబాదు నుంచి భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. వారికోసం రెండు వైపులా హెలిక్యాప్టర్ సేవలు తీసుకొస్తే గిరాకీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రూట్లో హెలికాప్టర్ సేవలు మొదలుపెడితే మంచి స్పందన వస్తుందని భావిస్తున్నారు.మరోవైపు విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో మినీ ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది ఏపీ ప్రభుత్వం. చిన్న చిన్న విమానాలతో పాటు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యే విధంగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. హెలికాప్టర్ టూరిజం ప్రోత్సహించే దిశగా విశాఖ, అరకు తో పాటు విజయవాడ, శ్రీశైలంలో వీటిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తోంది. సాధారణ విమానాశ్రయాల్లో ఉండే సౌకర్యాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న హెలిక్యాప్టర్ టూరిజం అనుగుణంగానే ఇక్కడ జాలీ ట్రావెలింగ్ కు ప్రభుత్వం యోచన చేస్తోంది.

# మృతుని కుటుంబానికి బియ్యం అందించిన ఆరెల్లి కిరణ్ గౌడ్

మంథని: మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో పులి ఓదెలు అని వృద్ధుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను యువజన కాంగ్రెస్ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సూరయ్యపల్లి మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జ్ ఆరెల్లి కిరణ్ గౌడ్ తనకు తోచినంతలో బియ్యం పంపించగా వారి సోదరుడు ఆరెల్లి వరుణ్ గౌడ్ మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రు విజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల సురేష్,హమాలి సంఘం అధ్యక్షుడు సుంకరి దేవేందర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులి సదానందం, బొల్లి సంతోష్ లు పాల్గొన్నారు.



# ఒడిశా వైద్యుడి ఔదార్యం.. 45 ఏళ్లుగా ఉచిత వైద్యం!



బ్రహ్మపుర: ఎనిమిది పదుల వయసులోనూ రోగులకు ఉచిత వైద్యం చేస్తున్నారు. దాదాపు 45 ఏళ్లుగా గిరిజనులకు, వెనుకబడిన ప్రాంతాల వారికి నిస్వార్థంగా సేవలుఅందిస్తున్నారు. ఆయనే ఒడిశాలోని బ్రహ్మపురకు చెందిన వైద్య నిపుణుడు డా.కృష్ణమోహన్. అందరికి అందుబాటులో వైద్యం కోసం జీవితాన్ని ధారపోసిన ఆయన.. తన కృషికి గుర్తింపుగా 2004లోఅప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ సర్జన్‌గా జాతీయ అవార్డు, 2021లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.ఒడిశాలోని సుకుందా గ్రామంలో 1939 ఆగస్టు 1న జన్మించిన డా.కృష్ణమోహన్ ప్రయాణం.. కటక్‌లోని ఎస్‌సీబీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పట్టాతో మొదలైంది. అనంతరం ఇంగ్లాండ్‌లో ఎంఎస్ పట్టా పొందారు. 1972–75 వరకు కామ న్వెల్త్ మెడికల్ ఫెలోగా విధులు నిర్వహిస్తూ.. రాడ్‌క్లిఫ్ ఇన్‌ఫర్మరీ వంటి ప్రతిష్ఠా త్మక ఆస్పత్రుల్లో గుర్తింపు పొందారు. ప్రొఫెసర్ పదవి ఇస్తామన్న హామీ లభించినప్పటికీ.. స్వదేశానికి తిరిగివచ్చారు. బుర్లాలోని విమ్‌సార్ ), బ్రహ్మపురలోని ఎంకేసీజీ వైద్యకళాశాల, కలకత్తా, పట్నా విశ్వవిద్యాలయాల్లో కీలక పదవులు నిర్వహించారు.

# అరెస్ట్ అయితే ఔట్...

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిస్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద ఆరెస్ట్ అయినా సరే... పదవి వదులుకోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు.ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతిం టుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెల రోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది. రాజ్యంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ం చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి.

లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ం జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ంంలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా..

దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది. బిల్లును చించి... హోంమంత్రిపైకి కూడా విసిరారు. ఇంత తీవ్రంగా వాళ్లు వ్యతిరేకించడానికి కారణం కూడా ఉంది.ఇది ప్రతిపక్షాలను అణగదొక్కే ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లు అని ఆ పార్టీలు అంటున్నాయి. అధికార పక్షం ఏదైనా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాకపోతే.. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని సీఎంలను మార్చేస్తారు.అరెస్టు అయిన వారు నేరస్తులు కాదు. నేరం నిరూపితం అయ్యే వరకూ నిందితులు అంతా నిర్దోషులే. 30రోజుల్లో ఆటోమేటిక్‌గా పదవి నుంచి తొలగించడం అంటే నేరం చేయకుండానే శిక్ష విధించడంకేం ద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ పేట్రేగిపోతాయి. ఇప్పటికే.. వాటిని రాజకీయాల కోసం వాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ చట్టం వస్తే.. అది మరో రాజకీయ అస్త్రం అవుతుంది.ప్రభుత్వాలను అస్థిర పరచడం కోసం.. ఈ ఏజన్సీల ద్వారా అరెస్టులు చేసి రిమాం డ్‌కు పంపుతారు. ఈలోగా ప్రభుత్వాలను మార్చేస్తారు

# ఓ వైపు ఆకలి చావులు.. మరోవైపు

### - బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న పాలస్తీనియన్లు
### - కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ





గాజాస్ట్రిప్ : ఓవైపు ఆకలి చావులు.. మరోవైపు భీకర దాడులు. గాజా స్ట్రిప్‌లో అనునిత్యం కన్పిస్తున్న దృశ్యాలివి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఆకలిలో విలవిలలాడిపోతుంటే మరోవైపు ఇజ్రాయిల్ సైనికులు ఏ మాత్రం కనికరం చూపకుండా అమానుషంగా దాడులు చేస్తూనే ఉన్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన అన్నార్తులు, సామాన్య ప్రజలను కూడా వదలడం లేదు. గాజాను బలవంతంగా ఖాళీ చేయించడమే ఇజ్రాయిల్ ఉద్దేశం. అదే జరిగితే పది లక్షల మంది నిరాశ్రయులవుతారు. వేలాదిమంది ప్రజలు ఇప్పటికే ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. నగర శివారులో జనసమ్మర్దం అధికంగా ఉండే సబ్రా, తుఫా వంటి ప్రాంతాలు బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. గాజా నగరంలో సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని సైతం బహిష్కరించాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోంది. 2023 అక్టోబరులో ఇజ్రాయిల్ దాడులు మొదలైనప్పటి నుంచి నేటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 62,686కు చేరింది. 1,57,951 మంది గాయాల పాలయ్యారు. గత నెల రోజులుగా ఇజ్రాయిల్ ముమ్మరంగా దాడులు చేస్తోంది. మృతులు, క్షతగాత్రుల్లో అత్యధికులు చిన్నారులు, మహిళలేనని స్వచ్ఛంధ సంస్థలు అంచనా వేస్తున్నాయి. నెట్‌జారిమ్ కారిడర్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పో యారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద వేచిచూస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరిపిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గాజా ప్రజలకు కాళరాత్రులే: గాజా ప్రజలు భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం దాడులతో నిరంతరాయంగా పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. గాయాల పాలైన వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. పేలుళ్ల ధాటికి గాలిలో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలా మంది ఊపిరి అందక బాధపడుతున్నారు.

ఆకలికి తాళలేక ఇప్పటి వరకూ 289 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా స్ట్రిప్‌లోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునిర్ అల్-బర్ష్ తెలిపారు. వీరిలో 115 మంది చిన్నారులే. గత 24 గంటల్లో 64 మృతదేహాలను ఆస్పత్రులకు తీసుకొచ్చారు. అనా రోగ్యాల బారిన పడిన వారికి వైద్య సేవలు కూడా అందడం లేదు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు కూడా ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నవజాత శిశువులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్న చిన్నారులు: గర్భిణులకు అవసరమైన పోషకాహారం లభించకపోవడంతో వారికి పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆకలికి తాళలేక చిన్నా రులు కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉండిపోతున్నారు. నగరంలోని సహాయ గిడ్డంగులు ఖాళీగా దర్శనమిస్తున్నా యి. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా ఆహారం, మందులు, ఇతర అత్యవసర సామగ్రి సరఫరాలు నిలిచిపోయాయి.

వివిధ దేశాల్లో నిరసనలు: గాజా నగరంలో ఇజ్రాయిల్ సృష్టించిన క్షామాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గాజాలో మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలోని 20 నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిస్బేన్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది ప్రజలు గాజాలోని అన్నార్తులకు తక్షణమే సాయం అందించాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్‌లో కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధాన్ని ఆపాలంటూ టెల్ అవీవ్‌లో వేలాదిమంది ర్యాలీ తీశారు. అనేక యూరోపియన్ నగరాలలో కూడా ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

## విశాఖ చుట్టూ టౌన్ షిప్స్



విశాఖపట్టణం:ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా థీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో థీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటుభూములను సమీకరిస్తారు. భూమియజమానులకు నష్టపరి హారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి,పర్యాట కం,వైద్యం,వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబ డులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికు లకు సైతం ఉద్యోగాలులభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖ కుచోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది.అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కోట్లు కేటాయించింది. దీని ద్వారా థీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఆగని ఎమ్మెల్యేల తప్పిదాలు?

అనంతపురం: కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజకవర్గానికి తామే బాస్ లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయకత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసరమనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు. దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు. వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు.అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు.పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది.అందుకే వార్నింగ్‌లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మె ల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్ లతో సరిపెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.

## పార్థివ దేహానికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు

కమాన్ పూర్: ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు జంగేటి రాములు పార్థివదేహాన్ని నివాళులర్పించారు. ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో ఐకెపి బుక్ కీపర్ జంగిటి తిరుపతి వాళ్ల తండ్రి,కాంగ్రెస్ నాయకులు మాజీ వార్డు సభ్యులు జంగిటి రాములు మృతి చెందగా వారి పార్థివదేహానికి ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్యలు పూలమాల వేసి ఘన నివాళులుఅర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలపడంజరిగింది. ఈ కార్యక్రమంలో వారి వెంట పోతారం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర మల్లయ్య,మాజీ ఎంపీటీసీలు బండ సమ్మయ్య,నెత్తెట్ల భారత లక్ష్మి కొమురయ్య,కాంగ్రెస్ నాయకులు చెల్కల ఓదెలు,కోటగిరి శ్రీశైలం,నర్ర రాజేష్,చెల్కల నరేందర్,కిషన్,నెత్తెట్ల శ్రావణ్,రమేష్,ఇట్టం గట్టయ్య, బత్తుల మల్లయ్య తదితర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు



## పూరీ క్షేత్రం పేరిట నకిలీ వెబ్‌సైట్ దోపిడీ!



విశ్వంభర, పూరీ: ఒడిశాలోని ప్రముఖ పూరీ జగన్నాథ ఆలయంలో ఆన్‌లైన్ పూజల పేరిట భక్తులను మోసం చేస్తున్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను పోలీసులు గుర్తించారు. శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు, దర్శనం, నైవేద్య సమర్పణ తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలతో ఆ వెబ్‌సైట్ రూ.వేలల్లో దోపిడికి పాల్పడుతోందని పూరీ ఎస్పీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో.. సైబర్ బృందాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌నుబ్లాక్ చేసి, కేసుదర్యాప్తునకు చర్యలుతీసుకుంటున్నట్లు చెప్పారు."జగన్నాథుని దర్శనం, ప్రత్యేక పూజలు తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇచ్చే నకిలీ వెబ్‌సైట్‌లకు భక్తులు దూరంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. ఆలయ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఛానెళ్ల ద్వారా సేవలను ధ్రువీకరించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో హోటళ్లను బుక్ చేసుకునే సమయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.



## పేరుకుపోతున్న డిఏ బకాయిలు
### ఉద్యోగుల్లో ఆందోళన!


అమరావతి: ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డిఏ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు మూడు డిఏలు పెండింగ్లో ఉండగా, నాలుగో డిఏ కూడా కొద్ది రోజుల్లో జత కాబోతోంది. దీనితో కలిపితే వది నుండి 12 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు చెల్లించాల్సిఉంటుందని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం పట్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బకాలు కోసం ఎన్నిసార్లు వినతులు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో 2.73 శాతంగా ఉన్న డిఏ 2023 జూలై నాటికి 33.67 శాతానికి చేరుకుంది. అయితే అప్పటి నుంచి డిఏ విడుదల కావడం లేదు. అనేక సార్లు ఉద్యోగులతో ఆర్థికశాఖ సమావేశాలు నిర్వహిం చడం, మధ్యలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీలు జరగడం, వాటిల్లో ఉద్యోగులు తమ డిమాండ్లను వెల్లడించడం మాత్రమే కనిపించింది తప్ప పరిష్కారం మాత్రం కనిపింలేదు. రెండు రోజుల క్రితం జరిగిన జెఎన్ సి సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. ఆ మరుసటి రోజు జరిగిన మంత్రివర్గ భేటీలో డిఏల ప్రకటన ఉంటుందని ఆశగా ఎదురుచూసినప్పటికీ నిరాశ తప్పలేదు. ఇదే సమయం పిఆర్ సి కమిషన్ నియామకం జరిగినప్పటికీ, ఎప్పుడు చర్చలు ఉంటాయి. ఎప్పుడు నివేదిక ఉంటుంది. ఎప్పుడు అమలులోకి వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

# బదిలీల్లో కులం రంగులు..?

శ్రీకాకుళం,: శ్రీకాకుళం జిల్లాలో వివాదాస్పదమైన ఓ కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ కొత్త మలుపు తిరిగింది. జిల్లాలో ఎప్పటి నుంచి నలుగుతున్న కళింగ వర్సెస్ వెలమ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బదిలీ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ శ్రీనివాస్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. కళింగ నాయకులను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం ప్రశాంతతకు మారు పేరు. అక్కడ రాజకీయం కూడా అంతే కూల్‌గా ఉంటుంది. వివాదాలు పెద్దగా ఉండవు. కానీ ఈ మధ్య కాలంలో అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. లోలుగు కేజీబీవీలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీ ఆయన మెడకు చుట్టుకుంది. ఆమెను కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడంతో వివాదం రాజుకుంది. తనపై కక్ష పూరితంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే తనను బదిలీ చేశారని ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపించారు. అంతే కాకుండా ఆమె ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. సౌమ్య ఆత్మహత్యాయత్నంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ దీన్ని తమకు అనుకూలంగా మార్చుకొని కూన రవికుమార్‌ను టార్గెట్ చేసింది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా ఉద్యోగులపై కక్షసాధింపులకు దిగుతున్నారని వైసీపీ అనుకూల మీడియా స్టోరీలు ప్రచురించింది. ఇప్పటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని ధర్మాన కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారు.కట్ చేస్తే సీన్‌లోకి వైసీపీ బహిష్కృత నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వచ్చారు. కూన రవికుమార్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని అలాంటి బదిలీల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉండే ఎవరైనా ఉద్యోగాల్లో చేరుతారని చెప్పుకొచ్చారు. కానీ సౌమ్య విషయంలో రాద్ధాంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పుకొచ్చారు.అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీపై దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు."జిల్లాలో వారం రోజులుగా ఒక ట్రాన్స్‌ఫర్ చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రాన్స్‌ఫర్ కోసం ఇంత రచ్చ జరగడం ఎప్పుడూ చూడలేదు. కలెక్టర్ చేసిన ట్రాన్స్‌ఫర్‌పై ఎందుకు రచ్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ సహజమే కదా. మరి ఇది ఎందుకు పొలిటికల్ వార్‌లా మారింది. కులాల ప్రస్తావన ఎందుకు వచ్చింది. దాడులు ఎందుకు జరుగుతున్నాయి? తటస్థ ఎమ్మెల్సీగా పరిశీలిస్తే చాలా విషయాలు వెలుగు చూశాయి. జిల్లావ్యాప్తంగా ఒక కులంపై దాడులు జరుగుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అటెండర్ నుంచి ఆర్టీవో వరకు ఒక కులం వాళ్లే ఉన్నారు. అది మంత్రి కులానికి చెందిన వారు. మిగతా కులాలపై వేధింపులు సర్వసాధారణమైపోయాయి. నియంత్రుత్వపాలన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. " అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళింగ కులానికి చెందిన నాయకులు ఎదుగుదల చూడలే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు దువ్వాడ శ్రీనివాస్. మంత్రి అచ్చెన్న చెప్పిన వెంటనే కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారని ఆరోపించారు. అచెన్న బాధితుడైన అధికారిని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నిం చారు. ఆయన ఏమన్నారంటే" మంత్రి అచ్చెన్న నిర్వాకం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనిముట్లు ఇచ్చే కంపెనీలతో డైరెక్ట్ మీటింగ్ పెట్టమని పేషీలో ఉన్న రాజమోహన్‌పై ఒత్తిడి తెచ్చారు. అది ఆయన చేయలేక ఒత్తిడి భరించలేక లెటర్ సెలవుపై వెళ్లిపోయారు. దీనిపై కృష్ణదాస్ ఏం చేస్తున్నారు. ఆయన్ని ఎందుకు పరామర్శించలేదు. అచ్చెన్న చెప్పాడని సౌమ్యను పరామర్శించారు. రాజమోహన్ అనుభవించింది మానసిక ఒత్తిడి కాదా... మంత్రి అచ్చెన్నపై విమర్శలు చేయరా. ఎందుకు ఒకే కులాన్ని టార్గెట్ చేస్తున్నారు." కులాన్ని టార్గెట్ చేస్తున్నారని తమ బుర్రల్లోకి వెళ్తే మాత్రం గేమ్ స్టార్ట్ చేస్తామని ధర్మాన, అచ్చెన్నకు వార్నింగ్ ఇచ్చారు దువ్వాడ. "ఎవడిపై రౌడీయిజం చేయాలని అనుకుంటున్నారు. ఇదే జరిగితే అది మా బుర్రల్లోకి ఎక్కింది అంటే మాత్రం కచ్చితంగా ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అచ్చెన్నకు వార్నింగ్ ఇస్తున్నాను. మేం గేమ్ స్టార్ట్ చేస్తాం. మరో ఉద్యమం ప్రారంభమవుతుంది. జాతికి నష్టం జరుగుతుంటే కచ్చితంగా నేను నిలబడతాను. ఆ జాతితోపాటు మిగతా కులాలను అన్నింటినీ ఏకం చేస్తాం. ప్రాణత్యాగాలు చేయడానికైనా సిద్ధం. కొందరు చీడపురుగులను వాడుకొని కులంలో చిచ్చు రేపాలని చూస్తారు. వారిని కూడా టార్గెట్ చేస్తాం. కళింగ జాగృతి కోసం ముందడుగు వేస్తాం. కళింగ కులస్తుడిని కాబట్టే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు దువ్వాడ. తాను ఉన్నన్ని రోజులు వారికి మునుగడ ఉండదనే ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయినా తాను వెనక్కి తగ్గబోనని అన్నారు. "నేను కళింగ కులానికి చెందిన వాడినని సస్పెండ్ చేశారు. స్పీడ్‌గా ఉంటానని సస్పెండ్ చేశారు. నేను ఉంటే వారి ఉనికి ఉండదని సస్పెండ్ చేశారు. నన్ను ఎదుర్కొని దమ్ము లేక సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి బట్టలు మడత పెట్టుకుంటానని అనుకున్నారు. కానీ రాజకీయాలలో మడతేయడానికి వచ్చాను. కులాన్ని వాడుకోవాలనుకుంటే ఎప్పుడో వాడుకునే వాడిని. ఇప్పుడు మాత్రం అన్ని కులాలను వాడుకుంటాను. అన్ని కులాలకు నాయకత్వం వహిస్తాను. కళింగ కులానికి అన్యాయం జరగడంతో ఇతర కులాలు కూడా నష్టపోతున్నాయి. అన్ని కులాలకు బాసటా ఉంటూ ముందు ఉండి నడిపిస్తాం. " అని అన్నారు.

# లాభమా?.. నష్టమా?

అమెజాన్,ఫ్లిప్‌కార్ట్, మీషో, మింత్రా ఇలా అనేక ఆన్‌లైన్ షాపింగ్ వేదికల్లో పండుగ సీజన్ వచ్చిందంటే చాలు ఎక్కడలేని ఆఫర్లు కనిపిస్తాయి. కస్టమర్లను టెంప్ట్ చేసేలా ఉంటాయవి. వీటిలో పలు ఈఎంఐ ఆఫర్లు, ప్రధానంగా నో-కాస్ట్ ఈఎంఐ ఆఫర్లు దర్శనమిస్తుంటాయి. ఎస్బీఐ, యాక్సిస్, ఐసీఐసీఐ, కొటక్ మహీంద్రా, ఫెడరల్, హెచ్‌డీఎఫ్‌సీ తదితర బ్యాంకులతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి నాన్ బ్యాంకింగ్ సంస్థలూ వీటిని అందిస్తాయి.




అయితే మీరు చేసే లావాదేవీకి సంబంధించి ఉన్న డాక్యుమెంట్లను పూర్తిగా చదివితే ఉత్తమం. ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్ ప్రకటనల్ని చూస్తే.. 'మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. స్కీంకు సంబంధించిన అన్ని పత్రాలను జాగ్రత్తగా చదవండి' అని ఉంటుంది.

దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు డాక్యుమెంట్లలో ఏముందనేది తెలుసుకోవడం ఎంత ముఖ్యమోనని. కనుక మనకు తెలియని కొన్ని చార్జీలు కూడా ఈ నో-కాస్ట్ ఈఎంఐలకు జత కలిసి ఉండొచ్చు. అన్నిసార్లూ ఇలాగే ఉంటుందనేది కాదు. కానీ ముందే పరిశీలించడం తెలివైన పని. మీరు కొనే వస్తువు ధరను మీరు ఎంచుకున్న నెలలతో భాగించండి. ఆ వచ్చేదే ఈఎంఐగా ఉంటే సమస్య లేదు. అంతకన్నా ఎక్కువగా ఉంటే ఏవేవో చార్జీలు పడ్డాయన్నమాటే. ఆయా బ్యాంకులనుబట్టి ఇవి రూ.199 నుంచి రూ.299దాకా ఉంటాయి. అలాగే ప్రాసెసింగ్ ఫీజులుంటాయి. వీటిపై జీఎస్టీ సైతం పడుతుంది. ఇక ఒక్క ఈఎంఐ చెల్లించకపోయినా.. ఆలస్య రుసుములు, జరిమానాలు, వడ్డీలు విధిస్తారు. పైగా క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

**సంప్రదాయ మార్కెట్‌లో..:**

ఈఎంఐల్లో కాకుండా ఒకేసారి నగదు చెల్లించి కొనే వీలుంటే.. ఒక వస్తువుపై ఆన్‌లైన్‌లో కనిపించే ధరకన్నా మన దగ్గర్లోని దుకాణాలు లేదా ఆయా స్టోర్లలోనే దాని రేటు తక్కువగా ఉంటుంది. అందుకే ఏదైనా వస్తువును ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయాలనుకుంటే మార్కెట్‌లో రేట్లు ఎలా ఉన్నాయి? అన్నది చూసుకోవాలి. దుకాణదారులతో బేరమాడితే ఇంకాతక్కువకు వచ్చే వీలున్నది. పైగా ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర అనవసరపు చెల్లింపులకు తావులేకుండా డీల్ చేసుకోవచ్చు. కాబట్టి ఈపండుగ సీజన్ షాపింగ్‌ను పక్కాగా ప్లాన్ చేసుకోండి. బయట మార్కెట్‌లో, ఆన్‌లైన్‌లో ఏయే ధరలున్నాయి అన్నది చూసుకోండి. బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులపైలభించే ఆఫర్లనూ గమనించి ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# అంతకంతకు పెరుగుతున్న అప్పులు..?




హైదరాబాద్: "రోడ్లు వేస్తున్నాం. విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. మెడికల్ కాలేజీలు కడుతున్నాం. అందరికీ తాగునీరు అందిస్తున్నాం. దేశ సౌభాగ్యాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తున్నాం.. గడచిన పది సంవత్సరాలలో దేశ అభివృద్ధిని పరుగులు పెట్టించాం. ప్రపంచ వేదికల మీద మన దేశానికి సమున్నత స్థానాన్ని కల్పించాం" ఇలానే ఉంటున్నాయి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు. మనదేశంలోనే కాదు, ప్రపంచ వేదికల మీద ఆయన ఇలానే మాట్లాడుతున్నారు.వాస్తవానికి ఆయన మాటల్లో కొంత నిజం ఉండొచ్చు.కానీ భారతదేశ అప్పులు మాత్రం అంతకంతకు పెరుగుతున్నాయి.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన నాటు నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అప్పు రెండు వందల లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దేశస్తుల జాతీయ ఉత్పత్తిలో 56.1 శాతానికి చేరుకుంది. కేంద్రానికి వివిధ రూపాలలో వస్తున్న ఆదాయంలో 37.32% రుణాలకు సంబంధించి చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతుంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కాదు.. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన వివరాలు.2015 -16 లో కేంద్రం అప్పులు 70.88 లక్షల కోట్లు ఉండగా.. గడచిన పది సంవత్సరాలలో అది 18,190 శాతం పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో రుణాలకు సంబంధించిన నిష్పత్తి 51.5 నుంచి 56.1 శాతానికి చేరుకుంది. దశాబ్ద కాలంలో కేంద్రం 100 లక్షల కోట్లకు మించి అప్పు చెల్లించింది. ఇందులో అసలు 32.61 లక్షల కోట్లు కాగా.. వడ్డీ 85.17 లక్షల కోట్లు కావడం విశేషం. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీలకు సంబంధించిన చెల్లింపుల కోసం 2015 -16లో 36.96% ఉండగా.. ఇప్పుడు ఏకంగా అది 37.32 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే అప్పులలో తమిళనాడు 9.55 లక్షల కోట్లతో మొదటి స్థానంలో ఉంది. 8.57 లక్షల కోట్లతో ఉత్తర్ ప్రదేశ్ రెండవ స్థానం, మహారాష్ట్ర 8.12 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉన్నాయి. కేంద్రం అప్పులు 200 లక్షల కోట్లకు చేరిన నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు దేశ ప్రజల ఆదాయానికి లోబడి అప్పులు చేశామని.. ఇప్పుడు కేంద్రం మాత్రం ఇష్టానుసారంగా అప్పులు చేస్తోందని.. అప్పులకు తగ్గట్టుగా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. బిజెపి ప్రతిపక్షంలోఉన్న రాష్ట్రాలలో అప్పుల గురించి మాట్లాడుతోం దని.. కేంద్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో వారు తెచ్చిన అప్పుల గురించి మాట్లాడటం లేదని సెటైర్లు విసురుతున్నది.

# మణుగూరులో బూడిద బతుకులు

## మసిబారుతున్న పల్లెలు

మణుగూరు, : భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వెలుగులతో పాటు సమీప గ్రామాలకు వ్యర్థాలను పంచుతోంది. పొగ ద్వారా వచ్చే వాయు కాలుష్యానికి తోడు బొగ్గుమండించగా మిగిలిన బూడిద ప్రజలను కమ్మేస్తుంది. ప్రజలతో పాటు పశువులు సైతం అనారోగ్యానికి గురవుతున్నాయి. పల్లెల నుండి పచ్చని చెట్ల వరకుబూడిద కమ్మేయడంతో ఎండి పోతున్నాయి. పంటలు సైతం వేయలేకపోతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గ్రీన్ బెల్టు ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనీ, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు దీర్ఘకాలిక రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు (బిటిపిఎస్) పరిసర గ్రామాల ప్రజల ఇబ్బందులపై విజయ క్రాంతి పరిశీలనాత్మక కథనం...ఎక్కడైనా పరిశ్రమలు వస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయి.కానీ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న బిటిపి ఎస్ పరిసర పల్లెలకు పరిశ్రమ శాపంలా మారిందని గ్రామాలలో కాలుష్యం భయాం దోళనలు రేకెత్తిస్తోందని, థర్మల్ స్టేషన్ నుంచి వెలువడే పొగ,బూడిద వల్లవాయు, జల కాలుష్యం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. రోజుకు వందల సంఖ్య లో లారీల ద్వారా బూడిద తరలింపు జరపడం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరిందని వాపోతున్నారు.ప్లాంట్ చిమ్నీల నుంచి వెలువడే పొగ ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా బూడిద వ్యర్థాలు గాలిలో కలసి కాలుష్యం పెరిగి పచ్చటి పల్లెలను బూడిద కమ్మేస్తోంది. థర్మల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయుకాలుష్యం దెబ్బకు పరిసర గ్రామాలు విలవిల లాడుతుండగా ఆయా కాలుష్య కారకాలను పీల్చుకుని ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇక పశు పక్ష్యాదుల సంగతి సరే సరి.

విష పూరిత కాలుష్య రేణువులు వెలు వడకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నా..బిటిపి ఎస్ అధికారుల పట్టింపులేని తనంతోనే తమకు ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేసినప్పుడు ప్రజా ప్రతినిధుల సమక్షంలో హామీలుఇస్తున్నా.. ఆతర్వాత వాటిని తుంగలో తొకడం షరామా మూలైందని మండి పడుతున్నారు... కళ్లు, ఒళ్లు మండి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భద్రాద్రి పవర్ ప్లాంట్ నుండి వెలు వడుతున్న బూడిద (యాష్) తరలించే బూడిద ట్యాంకర్లే ప్రధాన రహదారి నిండా దర్శనమిస్తున్నాయి. వాటి మూలంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాంకర్ల నుండి వెలువడుతున్న బూడిదతో పీల్చేగాలి... తినే తిండి.. తాగే నీరూ కలుషితమై ప్రజలను అనారోగ్య పాలు చేస్తోంది. శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులతో జీవితాలు మసకబారి పోతున్నాయి.చివరకు పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు బూడిద ముసిరిన బతుకులుగా మారుతున్నాయి. బూడిద, దుమ్ము, ధూళి కారణంగా ఒంటిపై దద్దుర్లు, చర్మంపై మచ్చలు వస్తున్నాయని, ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పరిశ్రమ ప్రభావిత గ్రామాలో యాజమాన్యం తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారం వారం వైద్య పరీక్షలు చేయాల్సి ఉన్నా గ్రామాల్లో ఆపరిస్థితి కనిపించడం లేదని. ప్రారంభంలో కొంత కాలం సీఎస్ ఆర్ కింద యాజమాన్యం మొక్కుబడి శిబిరాలు నిర్వహించినా.. ఇప్పుడు తమ వైపు కన్నెత్తి చూడటం లేదనిబాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్లాంట్ నుండి వెలబడుతున్న యాష్ కారణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. త్రాగే మంచి నీటి నుండి పండించే పంటల వరకు ప్రజలుఇబ్బందులను పడుతున్నారు. పరిసర గ్రామాలైన చిక్కుడు గుంట, దమక్క పేట, సాంబాయి గూడెం, రాయిగూడెం, పోతిరెడ్డిపల్లి, ఏడుల్ల బయ్యారం, సీతారాంపురం, ఉప్పాక, బొమ్మరాజుపల్లి తదితర గ్రామాల ప్రజలు నిత్యం బూడిదతో సహ జీవనం చేస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పవర్ ప్లాంట్ ను కొనసాగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పాటించడంలో బిటిపిఎస్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నిత్యం మంచు దుప్పటిలా గ్రామాలన్నీ బూడిదతో దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లు బూడిద పారి నల్లగా మారిపోతున్నాయి.వరి, ఎత్తి, మిరప సాగుచేసే రైతుల కు దిగు బడులు తగ్గి అర్థం కాని పంట తెగుళ్లతో నష్ట పోతున్నామని ఆందోళన చెందుతున్నారు .ఈ విషయంపై రాజకీయనాయకులు,పలువురు ప్రకృతి ప్రేమికులు పలు మార్లుచర్యలు తీసుకోవాలని కోరిన కాలుష్య సమస్యను అరికట్టడంలో ప్లాంట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా పవర్ ప్లాంట్‌యాజమాన్యం స్పందించి గ్రామాలలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# సర్కారీ ఆఫీసుల్లో..
# సోలార్ వెలుగులు



మెదక్: ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్స హించడంతో పాటు కరెంట్ బిల్లుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ క్రమంలో దృష్టి సారించిన యంత్రాంగం సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రభుత్వ భవనాలు, వాటికి వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్ల వివరాల సేకరణలో నిమగ్నమైంది. పూర్తిస్థాయి సమాచారం సేకరించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వా నికి నివేదించాలని ఆదేశించినప్పటికీ భారీ వర్షాల నేపథ్యంలో ఆలస్యమైంది. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటు కు చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. దీంతో బిల్లులు భారీగా వస్తున్నాయి. సరిపడా నిధులు లేనికారణంగా పలు శాఖలు కరెంట్ బిల్లులు సైతం చెల్లించలేని పరిస్థితి. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి.

ఇది ప్రభుత్వానికి తీవ్ర భారమవుతోంది. దీనిపై దృష్టి సారించిన సర్కారు జిల్లాలోని ఆసుపత్రులు, అంగన్వాడీలు, పాఠశాలలు, పంచాయతీ, ఇతర కార్యాలయాల భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్లను టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాల భవనాల గుర్తింపునకు కసరత్తు చేపట్టింది. ఇటీవల అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ భవనాల వివరాలు అందించాలని ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కార్య దర్శులు వివరాలు సేకరిస్తుండగా , మున్సిపల్ పరిధిలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. భవనం పై కప్పు విస్తీర్ణం, విద్యుత్ కనెక్షన్ కేటగిరీ, నెల వారీగా వినియోగం వంటి సమాచారం సేకరిస్తున్నారు. విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే చోటఎల్టీ, ఎక్కువగా ఉన్న భవన సముదాయాలపై హెచ్టీ సర్వీసులతో కూడిన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టరేట్,జిల్లా ఆసుపత్రి వంటి విశాల భవనాలపై 100 కిలో వాట్లకు పైబడి సామర్థ్యంతో కూడిన ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా ప్రతిపాదలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. బడ్జెట్ కేటాయింపు లకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నారు. తద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రయోజ కనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# ఇంజనీరింగ్ కాలేజీల క్వాలిటీ ఆధారంగానే ఫీజులు..


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పాత ఫీజులే బీ టెక్ కాలేజీల్లో అమలులో ఉంటాయని కౌన్సెలింగ్ నిర్వహించారు. చాలా మంది విద్యార్థులు కూడా ఆయా కాలేజీల్లో జాయిన్ అయ్యారు. దీంతో గత సంవత్సరం ఎలాంటి ఫీజులు వసూలు చేశారో.. ప్రస్తుతం కూడా అవే ఫీజులు వసూలు చేశారు. ఆ ఫీజులకే విద్యార్థులు అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. అయితే ఎప్పటి నుంచో ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఫీజులు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా.. వీటిపై స్పందించిన రాష్ట్ర తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజుల పెంపుపై ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఫీజుల పెరుగుదల కేవలం యాజమాన్యాల డిమాండ్ ఆధారంగా కాకుండా.. ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న విద్య నాణ్యత, ప్రమాణాలను బట్టి మాత్రమే నిర్ణయించబడుతుందని పేర్కొంది. దీనికి సంబంధించి ప్రభుత్వం కొత్త నిబంధనలను జారీ చేసింది. ఇప్పటికే ప్రవేశాలు, తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ఈ కొత్త విధానం ప్రాధాన్యతను సంతరించుకుంది.విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతోనే ఈ మార్పులు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది.

కొత్త ఉత్తర్వుల ప్రకారం, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించే ముందు అనేక అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.విద్యార్థుల హాజరుశాతం,ఫేషియల్ రికగ్నిషన్‌అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు, పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించడం వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే.. కళాశాలలు ఇస్తున్న విద్య నాణ్యత, విద్యార్థులకు లభించే ప్లేస్‌మెంట్ అవకాశాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనల అమలును కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. ఒక సమగ్రమైన నివేదిక ఆధారంగానే ఫీజుల పెంపుపై నిర్ణయం ఉంటుంది.ఈ విధానంవల్ల నాణ్యమైన విద్యను అందించే కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేయడానికి అవకాశం లభిస్తుంది. అదే సమయంలో.. తక్కువ ప్రమాణాలతో నడుస్తున్న కళాశాలలకు ఫీజుల పెంపు ఆశించినంతగా ఉండకపోవచ్చు. ఇది ఇంజనీరింగ్ విద్యలో ప్రమాణాలను పెంచుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులు ఇకపై కేవలం ఫీజుల ఆధారంగా కాకుండా.. కళాశాల నాణ్యతను బట్టి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ మార్పుల వల్ల తెలంగాణలో ఇంజనీరింగ్ విద్య మరింత పారదర్శకంగా, జవాబుదారీగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అటువిద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు కళాశాలల ఎంపికలో ఈ కొత్త నిబంధనలను దృష్టిలోఉంచుకోవాల్సి ఉంటుంది.ఏటా లక్షల్లో విద్యార్థులు బీటెక్ పూర్తిచేసుకొనిబయటకు వస్తున్నారు. క్యాంపస్ ప్లేస్ మెంట్స్ అనేవి కొంత మందికి మాత్రమే వస్తున్నాయి. రానివాళ్లు బయట మార్కెట్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. చదివిన చదువుకు సంబంధం లేకుండా ఉద్యోగాలు చేసేవారు ఇప్పటికే చాలా మంది ఉండగా.. కొత్తగావచ్చేవారితో ఆసంఖ్య పెరుగుతోంది.దీనికి గలకారణం విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్,నాణ్యమైన విద్య లేకపోవడమే. దీనిలో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# అమెరికా చదువులపై అనిశ్చితి!

## ట్రంప్ సర్కారు విధానాలే కారణం - సగానికి తగ్గిన భారత విద్యార్థులు



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల వల్ల స్టూడెంట్ వీసాలపై అమెరికాకు వెళ్లేవారి సంఖ్య జూలైలో దారుణంగా తగ్గిపోయింది. జూలైలో కేవలం సుమారు 79,000 మంది మాత్రమే అమెరికాకు వెళ్లారు. 2025లో నెలవారీ గణాంకాలను పరిశీలించినపుడు జూలైలోనే అత్యధికంగా 28 శాతం తగ్గుదల కనిపించింది. భారత్ నుంచి వెళ్లే విద్యార్థులు 46 శాతం మేరకు తగ్గిపోగా, చైనా నుంచి వెళ్లేవారు 26 శాతం వరకు తగ్గిపోయారు. నిరుటితో పోల్చుకున్నపుడు వరుసగా నాలుగో నెలలో ఈ తగ్గుదల నమోదైంది. యూఎస్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేషన్ డాటాను విశ్లేషించిన బ్లూమ్‌బెర్గ్ ఈ వివరాలను వెల్లడించింది. 2023-24 విద్యా సంవత్సరంలో 3,32,000 మంది భారతీయ విద్యార్థులు అమెరికన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఎన్‌రోల్ అయ్యారు. ఆ ఏడాదిలో విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే. ఆ తర్వాతి స్థానంలో 2,77,000 మందితో చైనా విద్యార్థులు ఉన్నారు. ఆ సంవత్సరంలో రికార్డు స్థాయిలో 11 లక్షల మంది విదేశీ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. మొదటిసారి

అమెరికాకు వెళ్లే విదేశీ విద్యార్థులు 30 శాతం మేరకు తగ్గుతారని ఆ దేశంలోని విద్యా సంస్థలు అంచనా వేశాయి. ఫలితంగా 2.6 బిలియన్ డాలర్ల మేరకు ట్యూషన్ రెవిన్యూ నష్టం వస్తుందని అంచనా వేశాయి. మరో అంచనా ప్రకారం, ఈ ఏడాదిలో 1,50,000 మంది విద్యార్థులు తగ్గుతారని, ఫలితంగా ఆగస్టు చివరి-సెప్టెంబరు ప్రారంభంలో సెమిస్టర్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్టర్‌కు 7 బిలియన్ డాలర్ల నష్టం వస్తుందని, అమెరికాలోని వివిధ నగరాల్లో 60,000కుపైగా ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని తెలుస్తున్నది.

**బిగ్ బ్యూటిఫుల్ కాదు, బిగ్ అగ్లీ చట్టం!:**

ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్ వల్ల అనేక మార్పులు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలకు నిధుల కోత, ఉద్యోగులపై వేటు వంటి వాటితో పాటు భారతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. తాజాగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ 6,000కుపైగా స్టూడెంట్ వీసాలను రద్దు చేసింది. వీసా స్క్రూటినీ కఠినతరం అయింది. వీటిలో సుమారు 4,000 వీసాల రద్దుకు కారణం క్రిమినల్ ఉల్లంఘనలని, ఉగ్రవాదానికి మద్దతిచ్చినందుకు 200-300 వరకు రద్దయ్యాయని తెలిపింది. మరోవైపు యూఎస్ ఇమిగ్రేషన్ అధికారులు వీసా దరఖాస్తుదారుల సామాజిక మాధ్యమాల ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా కానీ, యాంటీసెమెటిక్ కంటెంట్ కానీ ఉన్నాయేమో చూస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు పెట్టే ప్రతి పోస్టు ముప్పు తెచ్చిపెట్టేదిగా భావించవలసి వస్తున్నది.

**వీసా ఇంటర్వ్యూలు వాయిదా:** స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు కాన్సులేట్లు ఎఫ్-1 వీసాల కోసం కొత్త అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపేశాయి. దీంతో చాలా మంది ఆశావహులు చిక్కుకుపోయారు లేదా తమ ప్రణాళికలను వాయిదా వేసుకున్నారు. ఒకవేళ ఇంటర్వ్యూలు మంజూరైనా, దరఖాస్తుదారులు మునుపెన్నడూ లేనంత స్థాయిలో తనిఖీలకు గురవుతున్నారు.

# మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటో షూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభించారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సినిమా..

## విశ్వంభర సెట్స్‌లో చిరంజీవితో మౌనీ రాయ్..





మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' షూటింగ్ చివరి దశకు చేరింది. 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న ఈ భారీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా మెగా ఫ్యాన్స్‌లో భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వింటేజ్ చిరు మేజిక్‌ను మళ్లీ వెండితెరపై చూపించే ప్రయత్నంగా ఈసినిమాను తెరకెక్కిస్తున్నారు. 'బింబిసార' వంటి బ్లాక్‌బ స్టర్ ఇచ్చినదర్శకుడు మల్లిడి వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తు న్నారు. 14 లోకాల్లో హీరోయిన్ కోసం హీరో చేసే యాత్రే ఈ కథ యొక్క కేంద్ర బిందువుగా తెలుస్తుంది. విశ్వంభర చిత్ర కథకు ప్రేరణగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'పాతాళ భైరవి', 'కీలు గుర్రం'చిత్రాలు నిలిచాయి.

భారీ విజువల్స్, గ్రాఫిక్స్‌తో ఫుల్ స్కేల్ ఫాంటసీ మూవీగా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడిగా సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ నటిస్తుంది. చాలా కాలం తర్వాత చిరుతో త్రిష కలిసి పనిచేయడం అభిమానుల కు ఇది మంచి సర్‌ప్రైజ్ కావొచ్చు.

ఇక సినిమా స్పెషల్ ఎలిమెంట్‌గా బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ పర్ఫార్మ్ చేయబోయే స్పెషల్ సాంగ్ కానుంది. ఈ పాట చిరంజీవి ఐకానిక్ సినిమా గ్యాంగ్ లీడర్‌లోని ఎవర్‌గ్రీన్ మాస్ సాంగ్ 'రగులుతోంది మొగలిపొద' కు రీమిక్స్ అని తెలుస్తోంది. మౌనీ రాయ్ 'నాగినీ' సీరియల్, 'బ్రహ్మాస్త్ర' వంటి ప్రాజెక్టుల వల్ల ఇప్పటికే మంచి ఫేమ్ సంపాదించగా, ఈ పాటతో టాలీవుడ్‌లో తన క్రేజ్ మరింత పెరుగుతుందన్నదాంట్లో సందేహం లేదు. తాజాగా విశ్వంభర సెట్‌లో చిరంజీవితో కలిసి మౌనీ రాయ్ దిగిన పిక్ ఒకటి బయటకు వచ్చింది. ఈ పిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అయింది. ఈ పిక్‌తో విశ్వంభర చిత్రంలో మౌనీరాయ్ స్పెషల్ సాంగ్ చేస్తుందనే దానిపై ఫుల్ క్లారిటీ వచ్చింది.

# ట్రెడిషనల్ లుక్స్‌లో కృతి

లేటెస్ట్ గా కృతిశెట్టి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఫ్రెష్ బ్రీజ్‌లా కనిపిస్తున్నాయి. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన మార్క్ వేసుకుంటున్న కృతి, లైట్ బ్లూ కలర్ ట్రెడిషనల్ డ్రెస్‌లో సింప్లిసిటీకి సెన్సిబిలిటీని జోడించి, స్టన్నింగ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటోంది. ఆమె వేసుకున్న బ్యూటిఫుల్ జ్యువెలరీ, క్లోజ్ అప్ కెప్చర్స్ లో ఎక్స్‌ప్రెషన్స్‌ను ఎలివేట్ చేస్తూ, ఆమె నేచురల్ గ్లో, క్యూట్ స్మైల్ కి మిలియన్ డాలర్ అటిట్యూడ్ జతయ్యింది. ఫోటోలలో కృతి ఒకసారి మాయాజాలంలా చూస్తే, ఇంకోసారి మనసుకు హత్తుకునేలా స్టైలిస్తూ చూపించింది. ట్రెడిషనల్ దుస్తుల్లోనూ ఎంతగా స్టైలిష్ గా కనిపించొచ్చో, ప్రూవ్ చేసింది. కళ్లలో ఉన్న ఎమోషన్, ముఖంలో కనిపించే ఫ్రెష్‌నెస్ ఆమె ఫోటోలకు స్పెషల్ ఫీల్ తీసుకొచ్చింది. జువెలరీ, మేకప్, హెయిర్ స్టైల్ అన్నింటిలోనూ ఒక సాఫ్ట్ టచ్ కనిపిస్తోంది. ఫోటో గ్రఫీ, స్టైలింగ్ పరంగా కూడా ఆమె టీమ్ హైలెట్ అయింది. కృతిశెట్టి కెరీర్ విషయానికి వస్తే, ఆమె 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శ్యామ్ సింగారాయ్', 'బంగార్రాజు', 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' లాంటి సినిమాల్లో నటించి, యూత్ ఆడియన్స్‌కు చేరువ అయింది. హిట్ ఆఫర్లతో పాటు, వరుసగా స్టార్ హీరోలతో కూడా అవకాశం అందుకుంటోంది. కానీ ఇటీవల వచ్చిన కొన్ని చిత్రాలు మిక్స్‌డ్ టాక్ రావడంతో,ఆమెకు హిట్ సినిమాఅవసరం అయినపరిస్థితి కనిపిస్తోం ది. ఇటీవలే మోడ్రన్ గ్లామర్ ఫోటోషూట్‌లు షేర్ చేస్తూ, యువతను, ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది కృతి. రొటీన్ స్టైలింగ్‌కు భిన్నంగా, ట్రెడిషనల్ వేర్‌లో కూడా తనదైన మార్క్ చూపిస్తోంది. ఫ్యాన్స్ కామెంట్స్‌లో ఆమె న్యాచురల్ బ్యూటీని, నవ్వును ప్రత్యేకంగా మెచ్చుకుంటున్నారు. ఇక అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో పాటు ఇలాంటి యునిక్ ఫొటోషూట్లతో కృతిశెట్టి తన మార్క్‌ను మరింత బలపర్చేందుకు ప్రయత్నిస్తోంది.



# స్టంట్ మాస్టర్‌తో గోపీచంద్ కొత్త సినిమా..!



గతేడాది బీమా, విశ్వం సినిమాలతో ప్రేక్షకులకు హాయ్ చెప్పాడు గోపీచంద్. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద గోపీచంద్ అభిమానులు, మూవీ లవర్స్‌ను నిరాశ పరిచాయి. ప్రస్తుతం గోపీచంద్ ఘాజీ ఫేం సంకల్ప్‌రెడ్డి డైరెక్షన్‌లో చేస్తున్న సినిమాపై ఫోకస్ పెట్టాడు. ఈ మూవీ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే కంటే ముందే గోపీచంద్ మరో సినిమాను గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడంటూ ఓ వార్త ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇంతకీ ఈ సారి గోపీచంద్ సినిమా చేయబోతుందెవరితోనో తెలుసా..? పాపులర్ ఫైట్ మాస్టర్ వెంకట్‌తో ఈ సినిమా ఉండబోతుందట. ఈ మూవీతో వెంకట్ డైరెక్టర్‌గా మారబోతుండటం విశేషం. హై ఆక్టేన్ యాక్షన్ ఎలిమెంట్స్ తోపక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. డాకు మహారాజ్, భగవంత్ కేసరి సినిమాలకు అదిరిపోయే స్టంట్స్ కంపోజ్ చేశాడు వెంకట్. ఈ ఫైట్ మాస్టర్ చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశాడట గోపీచంద్. ఈ చిత్రాన్ని యాత్ర, యాత్ర 2 లాంటి పొలిటికల్ బయోపిక్స్ తెరకెక్కించిన 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుందని సమాచారం. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఆగస్టు 9వ తేదీన ఈ సినిమా ప్రకటన కూడా ఉండనుందని తెలుస్తోంది. మొత్తానికి గోపీచంద్ ఈ సారి ఫైట్ మాస్టర్ చెప్పిన కథతో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కొత్తదనంతో కూడిన సినిమాను ప్రేక్షకులకు అందించాలని చూస్తున్న గోపీచంద్ మరి ఈ సారి రూట్ మార్చి స్టంట్ మాస్టర్‌తో చేయబోతున్న సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.

# నయన్ అతనికి ఇంప్రెస్..!

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో మెగా మూవీకి సైన్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి 157 సినిమాలో చిరంజీవి సరసన నటిస్తుంది నయనతార. ఆల్రెడీ ఈ ఇద్దరు సైరా నరసింహారెడ్డి సినిమాలో కలిసి జత కట్టారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి సినిమాకు పనిచేస్తున్నారు. ఐతే పెళ్లి తర్వాత నయనతార చాలా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తుంది. ఇతర భాషల సినిమాలైతే మాక్సిమం కాదనేస్తుంది. కానీ చిరుతో సినిమా అది కూడా అనిల్ డైరెక్షన్ లో అనేసరికి ఆసక్తి చూపించింది. అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ఎంట్రీ తోనే నయనతార ఒక క్రేజీ వీడియోతో హాయ్ చెప్పింది. ఇక సినిమాలో ఆమె రోల్ కూడా క్రేజీగా ఉండబోతుందని తెలుస్తుంది. సినిమాలో చిరంజీవి పి.ఈ.టి మాస్టర్ గా కనిపిస్తాడట. నయన్ పాత్ర గురించి డీటైల్స్ బయటకు రాలేదు. ఐతే అనిల్ వర్కింగ్ స్టైల్ కి నయనతార ఫిదా అయ్యిందని టాక్. ఎందుకంటే అసలేమాత్రం మిస్ యూజ్ లేకుండా స్టార్ డేట్స్ ని వాడుతున్నాడట అనిల్ రావిపూడి. అందుకే నయనతారకి కూడా అతను బాగా నచ్చేశాడట. అనిల్ రావిపూడితో పనిచేసిన ఎవరైనా ఈ మాటే చెబుతారు. నయనతార తెలుగు సినిమా చేయాలనుకోవడమే షాకింగ్ థింగ్ అయితే.. సినిమా అనుకున్న విధంగా చక చకా కానివ్వడం చూసి ఆమె సర్ ప్రైజ్ అవుతుందట. స్టార్స్ ని డేట్స్ అడిగి.. దానికి ఒకటి రెండు రోజులు అదనంగా తీసుకునే డైరెక్టర్స్ ని చూశాం కానీ అనిల్ ఇచ్చిన స్టార్ డేట్స్ కి రెండు రోజుల ముందే షెడ్యూల్ పూర్తి చేస్తాడట. అందుకే అతని గురించి అందరు పాజిటివ్ గా చెప్పుకుంటున్నారు. నయనతార కూడా ఇంప్రెస్ అయ్యింది అంటే ఆమెను మళ్లీ మళ్లీ తన సినిమాల్లో తీసుకునే ఛాన్స్ ఉంటుంది.



# అందం కోసం అలా చేయడం తప్పేం కాదు



'ఈ రోజుల్లో అందంగా కనిపించేందుకు ప్రతి ఒక్కరూ కాస్మోటిక్ సర్జరీలు చేయించుకుంటున్నారు. అదేం తప్పు కాదు. అయితే.. ఈ విషయంలో మహిళలను మాత్రమే బ్లేమ్ చేయలేం. కాస్మొటిక్ సర్జరీలను ఆశ్రయిస్తున్న పురుషులు ఈ రోజుల్లో చాలామంది ఉన్నారు. అంతెందుకు సినీ పరిశ్రమలోనే అలాంటి వాళ్లు కోకొల్లలు.' అంటూ బాంబ్ పేల్చారు ఒకనాటి బాలీవుడ్ అందాలతార కాజోల్. ఆమె నటించిన 'సర్ జమీన్' చిత్రం రీసెంట్‌గా ఓటీటీలో విడుదలైంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అందం, గ్లామర్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు కాజోల్. 'అందం లేనివాళ్లు అందంగా కనిపించాలని కోరుకోవడంలో తప్పేంలేదు. కెమెరా ముందు నటించే అవకాశం ఉన్నప్పుడు, అందం కోసం కొన్ని ప్రయత్నాలు చేయడం సమర్ధనీయమే. అలాంటి వారిని జడ్జ్ చేయకూడదు.' అని హితవు పలికారు కాజోల్. వయసు గురించి మాట్లాడుతూ 'ఈ మధ్య నా వయసు కొందరు సోషల్ మీడియా వాళ్లకు సమస్యగా మారింది. నా దృష్టిలో ఏజ్ అనేది ఓ నంబర్ అంతే. జీవించడానికి నాకెన్నో అద్భుతమైన సంవత్సరా లు ఇంకా మిగిలివున్నాయి.' అంటూ పేర్కొన్నారు కాజోల్.

Publisher, Printer, Owned by Gonguluri Venu Gopal Sharma, Printed at Narendra Printers, 64-156, U/S Old Bus Stand Kurnool, Published from : H.No. 2nd Floor, Reddy Building, Bhagyanagar, Kurnool, A.P.
APTEL/2108/28008., Editor : GONGULURI VENUGOPAL SHARMA, Cell : 9440391525, E-mail : Prajadarbar94@gmail.com